

ఆంధ్రజ్యోతి



గన్నవరం రాజకీయ చరిత్రలో బ్లాక్ డే

వైసీపీ గూండాలు నిప్పు పెట్టడంతో టీడీపీ కార్యాలయం ఆవరణలో కాలిపోతున్న కారు(ఫైల్)

టీడీపీ ఆఫీసుపై దాడికి నేటితో రెండేళ్లు పూర్తి

ఎందరో మహానుభావులు గెలిచిన గడ్డపై ప్రజాస్వామ్యం అపహాస్యం

- కార్ల దహనం, బైకుల విధ్వంసం.. కార్యాలయాన్ని తగులబెట్టేందుకు యత్నం
- ఎన్‌హెచ్- 16పై కర్రలు, రాళ్లతో చెలరేగిపోయిన వైసీపీ అల్లరి మూకలు
- భయంతో పరుగులు తీసిన షాపుల యజమానులు, పట్టణ ప్రజలు
- రాజకీయ చైతన్యం కలిగిన గన్నవరంలో విధ్వంసకాండపై సర్వత్రా విమర్శలు





జాతీయ రహదారిపై కర్రలు, రాళ్లతో స్వైర విహారం చేస్తున్న వైసీపీ శ్రేణులు, (ఇన్‌సెట్‌లో) టీడీపీ ఆఫీసులో ధ్వంసమైన ఫర్నీచర్(ఫైల్)

గన్నవరం రాజకీయ చరిత్రలో నేడు (గురువారం) బ్లాక్‌డే. ఎందరో మహానుభావులను చట్టసభలకు పంపిన గడ్డపై సరిగ్గా రెండేళ్ల కిందట (2023, ఫిబ్రవరి 20న) వైసీపీ రౌడీ మూకలు రెచ్చిపోయాయి. ప్రజాస్వామ్యవాదులు అసహ్యించుకునేలా గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి చేశాయి. ఫర్నీచర్ ధ్వంసం చేసి కార్యాలయాన్ని తగుల బెట్టేందుకు యత్నించాయి. ఆవరణలోని బైక్‌లు, కార్లకు నిప్పుపెట్టాయి. కర్రలు, రాళ్లు పట్టుకుని స్వైర విహారం చేశాయి. దొరికిన వారిని దొరికినట్టు చితకబాదుతూ రహదారులపై విధ్వంసకాండ సృష్టించాయి. రాజకీయ చైతన్యం కలిగిన గన్నవరంలో ఉన్నామన్న కనీస స్పృహ కోల్పోయిన అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పథక రచనలో ఇదంతా జరగడం చూసి ప్రజలు నివ్వెరపోయారు. రాజకీయ విలువల పతనానికి టీడీపీ కార్యాలయంపై దాడి పరాకాష్టగా నిలిచిపోయింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై జగన్ ప్రభుత్వంలో వైసీపీ రౌడీ మూకలు దాడి చేసి నేటి(గురువారం)తో రెండేళ్లు పూర్తయింది. దాడులకు బాధ్యులైన వారిపై గత వైసీపీ ప్రభుత్వంలో 14 నెలల పాటు చర్యలు తీసుకోకపోగా, ప్రతిగా టీడీపీ నాయకులపై కేసులు పెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో టీడీపీ ఆఫీసుపై దాడి ఘటనకు సంబంధించి విచారణ ప్రారంభించగా.. ప్రస్తుత పరిణామాలు అందరికీ తెలిసిందే. ప్రజాస్వామ్య వ్యవస్థలో కక్షలకు తావిస్తే ప్రజలు హర్షించరు. కక్షపూరిత రాజకీయాలు చేసేవారు ఎవరైనా సరే వారిని ఇంటికి సాగనంపటం అనేక సందర్భాలలో చూశాం. రౌడీయిజం చేసే ఏ నాయకుడిని కూడా ప్రజలు అంగీకరించటం లేదు. గన్నవరం టీడీపీ ఆఫీసుపై వైసీపీ మూకలు దాడికి పాల్పడిన ఘటన అనంతరం జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు రాష్ట్రంలో మూడో అత్యధిక ఓట్లు వచ్చిన మిగతా 6లో..

ప్రశాంతంగా ఉండే గడ్డపై అరాచకం

ఎంతో ప్రశాంతంగా ఉండే గన్నవరం గడ్డపై భయానక విధ్వంసం జరుగుతుందని ఎవ్వరూ ఊహించలేదు. అంతకు ముందే వంశీ అనుయాయులు మూడున్నరేళ్లుగా నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా భూ కబ్జాలు, భూ రికార్డుల ట్యాంపరింగ్, అక్రమ మైనింగ్ వంటి కార్యకలాపాలతో గన్నవరం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఘటనలను ప్రశ్నించే వారిని టార్గెట్ చేసుకుని పోలీసు కేసులు పెట్టి వేధించటంతో.. ప్రజలకు అండగా టీడీపీ నేతలు నిలిచారు. వారిపైనా పోలీసులు కేసులు పెట్టి వేధింపులకు దిగారు. ఈ పరిణామాలన్నింటినీ చివరి రెండున్నరేళ్లు నియోజకవర్గ ప్రజలు ప్రత్యక్షంగా చూశారు. వంశీ అనుయాయుల చేతుల్లో ఎంతో మంది మోసపోయారు.


ఆలపాటి రాజేంద్రప్రసాద్


కేఎస్ లక్ష్మణరావు

రాజుకుంటున్న ఎమ్మెల్సీ ఎన్నికల వేడి

27న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఆలపాటి రాజేంద్రప్రసాద్, కేఎస్ లక్ష్మణరావు మధ్యనే ప్రధాన పోటీ
- ఊపందుకున్న అభ్యర్థుల ప్రచారం.. ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సమయం దగ్గర పడింది. ఈ నెల 27వ తేదీ పోలింగ్, మార్చి 3వ తేదీన గుంటూరులో కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. సాధారణ ఎన్నికలు జరిగిన తొమ్మిది నెలల తర్వాత జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో ఎవరు విజయం సాధిస్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. కూటమి నాయకులు తమ అభ్యర్థిని గెలిపించుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తోంది.

కూటమి ప్రభుత్వానికి ప్రతిష్ఠాత్మకం

సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని 16 అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ ఒక్కటీ గెలుచుకోలేక చతికిలపడింది. ప్రస్తుతం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ తమ అభ్యర్థిని పోటీకి నిలపలేదు. కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావు మధ్యనే ప్రధానంగా పోటీ ఉంటుందని ఎన్నికల విశ్లేషకులు చెబుతున్నారు. కూటమి నాయకులు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కమిటీలను ఏర్పాటు చేసి ఆలపాటి గెలుపు కోసం ఇప్పటికే మొదటి విడత ప్రచారాన్ని పూర్తిచేశారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే రెండో విడతలో కూటమి అభ్యర్థిని గెలిపించేందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న ఆలపాటి

కూటమి ప్రభుత్వం బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆయన గెలుపు కోసం అధికశాతం ఉపాధ్యాయ సంఘాల నాయకులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆలపాటి తన మనుషుల ద్వారా ప్రతి ఓటరుకు ఫోన్‌చేసి ఓటు అభ్యర్థిస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల్లోని కీలక నాయకులు జిల్లా వ్యాప్తంగా పర్యటించి ఆలపాటిని గెలిపించాలని ప్రచారం మిగతా 6లో..



చికెన్, కోడిగుడ్లు తింటున్న జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చినరసింహులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ శర్మిష్ట తదితరులు

జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదు

- అపోహలతో పౌష్టికాహారానికి దూరం కావద్దు
- అవగాహన సదస్సులో జిల్లా వైద్యాధికారుల వెల్లడి
- చల్లపల్లిలో చికెన్, ఎగ్ మేళా

6లో

ఇంటర్ పరీక్షలకు 63 కేంద్రాలు

మార్చి ఒకటి నుంచి జరిగే పరీక్షలకు సర్వం సిద్ధం

- హాజరుకానున్న 45,430 మంది విద్యార్థులు
- బాలుర కంటే బాలికలే అధిక శాతం

8లో

గొప్పలు కాదు తిప్పలు!

తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో అసంపూర్తిగా నాడు-నేడు పనులు

- వెక్కిరిస్తున్న మొండిగోడలు.. శ్లాబు నుంచి ఊడి పడుతున్న పెచ్చులు
- 395 మంది విద్యార్థులున్న హైస్కూల్లో అన్నీ అసౌకర్యాలే

8లో

2,603 గ్రాముల బంగారం రికవరీ

- కర్ణాటక బ్యాంకులో ఇంటిదొంగ ఆట కట్టు
- మీడియాతో కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధరరావు

8లో

దుర్భరం నుంచి.. అబ్బుర పరిచేలా..

- మారుతున్న రహదారుల రూపు రేఖలు

6లో

మత్స్యకారులకు చేయూతనివ్వండి

- కలెక్టర్ బాలాజీ

8లో

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(5)(6) నందలి నిబంధనలతో చదువకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ, ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.
సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయునది ఏమనగా 'శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌'కు తనఖా పెట్టబడిన / ఛార్జ్ చేయబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులు 'శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్' (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడేది) యొక్క అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనపర్చుకోబడినవి మరియు పట్టికలో ఇవ్వబడిన విధంగా సదరు ఋణగ్రహీతలు మరియు హామీదారుల నుండి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క మిగతా బకాయిని రాబట్టుకొనుటకు **ది.26-03-2025న ఉ॥ 11-00 గం. నుండి మ. 1.00 గం.** మధ్య ఇ-వేలంలో **"ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అది లానే"** ప్రాతిపదికన విక్రయించబడును. ఋణగ్రహీతలు మరియు హామీదారుల వివరాలు, బకాయి సొమ్ము, స్థిరాస్తి సంక్షిప్త వివరం మరియు తెలిసిన ఎన్‌కంబరెన్స్‌లు, స్వాధీనత రకం, రిజర్వు ధర మరియు ధరావత్తు మరియు పెంపుదల దిగువపేయబడినవి.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(5)(6), రూల్ 9(1) క్రింద 30 రోజుల చట్టబద్ధ ప్రకటన

ఇ-వేలం తేది అనగా ఇ-వేలం ప్రకియ ప్రారంభమైనప్పుడు లేదా ముందు తేది. 26-03-2025 లోగా పైన తెలిపిన మొత్తముతో పాటు చెల్లింపు తేదీ నాటికి వడ్డీ మరియు అనుబంధ ఖర్చులను చెల్లించవాల్సిందిగా లేని యెడల సదరు ఆస్తి వేలం వేయబడునని / విక్రయించబడునని తెలియజేస్తున్నాము.
ఆసక్తిగల బిడ్డర్‌లకు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్‌ను రూపొందించడంలో, డేటాను అప్‌లోడ్ చేయడంలో, బిడ్‌ను సమర్పించడంలో, ఇ-బిడ్డింగ్ ప్రక్రియపై శిక్షణ మొ॥ వాటి కొరకు సంప్రదించండి. మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, సంప్రదించాల్సిన వ్యక్తి అసద్ ఖాన్, మొబైల్ నెం. 7128695102, వివేక్ అరోరా, మొబైల్ నెం. 9988001555, VIVEK ARORA <vivek.arora@samil.in> మరియు ఆస్తికి సంబంధించిన వివరముల కొరకు ఆఫీస్ పని వేళలు మరియు పని దినాలలో శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, అధీకృత అధికారి, లక్ష్మీనారాయణ చిరకాల, మొబైల్ నెం. 8367466865, నందు సంప్రదించగలరు.
బకాయి శేషం ఏదేని ఉన్నచో ఏ కారణం చూపకనే తిరస్కరించు హక్కు అధీకృత అధికారికి కలదు. ఆన్‌లైన్ వేలం మా వేలం ఏజెన్సీ "శ్రీరామ్ ఆటో మాల్ ఇండియా లిమిటెడ్" యొక్క వెబ్‌సైట్ https://eauctions.Samil.in/home పై నిర్వహించబడును. టెండరు దాఖలు / బిడ్ ఫారం పొందు / టెండరు తెరచు మరియు వేలం జరుగు ప్రదేశం కొరకు వెబ్‌సైట్ (https://eauctions.Samil.in/home) ను చూడండి. అమ్మకం యొక్క నియమ నిబంధనల వివరాలకై "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో ఇవ్వబడిన లింక్ https://www.shriramfinance.in/auction ను చూడండి.
గమనిక : "ఇందుమూలముగా తెలియజేయునదేమనగా 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్' ఎన్‌సిఎల్‌టి, చెన్నై వారి ఉత్తర్వుల ప్రకారం 'శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్'లో విలీనమైనది. తర్వాత 30-11-2022 తేదీనాటి పేరు మార్పునుసరించి ఇన్‌కార్పోరేషన్ సర్టిఫికేట్ ద్వారా 30-11-2022 నుండి వర్తింపుతో "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" యొక్క పేరు "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా మార్చబడినది.
ప్రదేశం: విజయవాడ, తేది: 19-02-2025 (అధీకృత అధికారి)

దుర్భరం నుంచి.. అబ్బుర పరిచేలా..



నేడు

కూచిపూడి - భట్లపెనుమర్రు రహదారి



కూచిపూడి - పెదపూడి రహదారి దుస్థితి (ఫైల్)



నాడు

కూచిపూడి - భట్లపెనుమర్రు రహదారి దుస్థితి (ఫైల్)



నేడు

కూచిపూడి - పెదపూడి రహదారి

» రూపు రేఖలు మారుతున్న రహదారులు

కూచిపూడి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారుల రూపు రేఖలు మారుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంతలమయంగా.. ప్రమాదాలకు నిలయంగా ఉన్న రహదారులు నేడు కొత్తరూపు సంతరించుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూచిపూడి నుంచి భట్లపెనుమర్రు వెళ్లే రహదారి దుస్థితిపై అప్పట్లో అధికారులు, ప్రజాప్రతినిధులను ఈ ప్రాంత ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారిని పూర్తిస్థాయిలో ఆధునీకరించటంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయ్యంకి నుంచి మొవ్వ కోర్టు వరకు ఉన్న రహదారి మరమ్మత్తులకు కూటమి ప్రభుత్వం కోటి రూపాయల నిధులు మంజూరు చేసింది. రహదారి పనులు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇంకా అస్తవ్యస్తంగా ఉన్న కూచిపూడి నుంచి బార్లపూడి వెళ్లే రహదారి, పెదముత్తేవి నుంచి మొవ్వ, కారకంపాడు నుండి కొండవరం వెళ్లే రహదారులను సైతం అభివృద్ధిపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదు

» అపోహలతో పౌష్టికాహారానికి దూరంకావద్దు

» అవగాహన సదస్సులో వైద్యాధికారుల వెల్లడి

» చల్లపల్లిలో చికెన్, ఎగ్ మేళా



చల్లపల్లిలో అవగాహన సమావేశంలో ప్రసంగిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ చిననరసింహులు

చల్లపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బర్డ్ ఫ్లూపై ఎలాంటి అపోహలకు తావులేదు.. కృష్ణా జిల్లాలో బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవు.. కోళ్లు ఆరోగ్యంగా ఉన్నాయి.. ప్రజలు చికెన్, కోడిగుడ్లను ధైర్యంగా తినవచ్చు అని జిల్లా పశుసంవర్ధశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చిననరసింహులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ శర్మిష్ఠలు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్, జాతీయ కోడిగుడ్ల సమన్వయ సంఘం, కృష్ణా జిల్లా లేయర్స్ రైతుల వెల్ఫేర్ అసోసియేషన్, జిల్లా పశుసంవర్ధకశాఖ, రెవెన్యూశాఖల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక చంద్రరాజేశ్వర రావు వికాసకేంద్రంలో బర్డ్ ఫ్లూపై బుధవారం మధ్యాహ్నం అవగాహన సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేడీ మాట్లాడుతూ, జిల్లాలో 27లక్షల కోళ్లు ఉన్నాయని, ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవన్నారు. బర్డ్ ఫ్లూ వ్యాప్తిచెందకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో పటిష్టమైన చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో, ప్రజల ఆరోగ్యంలోనూ కోళ్ల పరిశ్రమ ముఖ్య భూమిక వహిస్తోందన్నారు. కోళ్ల రైతులు వ్యాక్సినేషన్ వైద్యులతోపాటు స్థానిక పశువైద్యులతో సన్నిహితంగా ఉంటూ కోళ్లపెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలనీ, చిన్న పొరపాట్లకు సైతం తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో విపరీత ప్రచారం పౌల్ట్రీరంగంపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ శర్మిష్ఠ మాట్లాడుతూ, అపోహలు నమ్మి పౌష్టికాహారాన్ని ప్రజలు దూరం చేసుకోవద్దని తెలిపారు. బర్డ్ ఫ్లూ అనేది బర్డ్‌కు మాత్రమే వస్తుందని, మనుషులకు రాదని, ఇప్పటివరకూ వచ్చినట్లు దాఖలాలు లేవన్నారు. జిల్లాలో ఇప్పటివరకూ బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కాలేదని తెలిపారు. కోళ్ల పెంపకందారులు పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటుచేయాలని, పనిచేసేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆఫ్ బాయిల్డ్ చికెన్ తినకుండా పూర్తిగా నిర్దిష్టమైన వేడిలో వండి తింటే ఎలాంటి ప్రమాదం లేదన్నారు. ఆర్డీవో స్వాతి మాట్లాడుతూ, చికెన్, కోడిగుడ్లను ధైర్యంగా తినవచ్చని సూచించారు. పౌల్ట్రీ అసోసియేషన్ నాయకులు మాలెంపాటి కాంచనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, పౌల్ట్రీ రంగ నిపుణులు డాక్టర్ సోమిరెడ్డి, డాక్టర్ సుజిని, అసోసియేషన్ నాయకులు, పశువైద్యాధికారులు, పౌల్ట్రీరంగ ప్రముఖులు, కోళ్ల రైతులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు. బర్డ్ ఫ్లూపై ప్రజల్లో అపోహలు తొలగించేందుకు చికెన్, ఎగ్ మేళాను నిర్వహించారు. సమావేశానికి విచ్చేసిన అధికారులతోపాటు పౌల్ట్రీరంగ పెద్దలు, కోళ్ల రైతులతోపాటు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి చికెన్, కోడిగుడ్లను తిన్నారు.

అక్కడ ఫైలు కదలాలంటే..

ముడుపులు ఇవ్వాల్సిందే!

» దుర్గగుడిలో గ'లీజు' వ్యవహారం

» ఈవో ఆదేశాలు బేఖాతరు, ఏళ్లతరబడి తిష్టవేసిన ఉద్యోగులు



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో లీజుల విభాగంలో కరెన్సీ నోట్లు చూపందే ఫైలు కదలదన్న ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఈ విభాగంలో కొందరు ఉద్యోగులు ఏళ్ల తరబడి తిష్టవేసి ఈవో ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తున్నట్టు సమాచారం. షాపులకు, గంపలు, ఇతరత్రా లీజులకు సంబంధించి ఏ ఫైలు కదలాలన్నా సిబ్బందికి కానుకలు చెల్లించుకోవాల్సిందేనని షాపుల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. షాపుల అద్దె బకాయిలు లక్షల్లో పెరిగినా వసూలు చేయకుండా ఉద్యోగులు అద్దెదారులతో కుమ్మక్కవుతున్నారు. ఆ విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్న అధికారికి బకాయిలు చెల్లించిన నలుగురు వ్యాపారస్తులకు షాపులు కేటాయించాలని రెండు నెలల క్రితం ఈవో ఆదేశాలు ఇచ్చారు. అయితే ఆ అధికారి రేపు మాపు అంటూ వ్యాపారస్తులను తిప్పుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, బయట వడ్డీకి తెచ్చి బకాయిలు చెల్లించామని, షాపులు కేటాయించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని వ్యాపారస్తులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈవో ఆదేశించినా సంబంధిత అధికారి, కింది సిబ్బంది ఫైలు కదలపకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. లీజుల విభాగంలో ఏ ఫైలు కదలాలన్నా కానుకలు చెల్లించుకోవాలంటే భారంగా పరిణమిస్తోందని వ్యాపారస్తులు చెబుతున్నారు.

కష్టానికి ప్రతిఫలం..

» యోగి వేమన వర్సిటీ వీసీగా ఫణితి ప్రకాష్‌బాబు

» జగ్గయ్యపేటలో హర్షాతిరేకాలు



జగ్గయ్యపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లా యోగి వేమన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌గా జగ్గయ్యపేటకు చెందిన ఫణితి ప్రకాష్‌బాబు నియమితులవడంతో పేటలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయుల కుటుంబం నుంచి వచ్చి ప్రొఫెసర్, వైస్‌చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టడం జగ్గయ్యపేట ప్రతిష్ఠ ఇనుమడించిందని ప్రకాష్‌బాబు మిత్రులు, పరిచయస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రకాష్‌బాబు తండ్రి డానియేల్ (92), తల్లి సత్యవతమ్మ (87)లు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేసి రిటైరయ్యారు. ప్రస్తుతం కోదాడ రోడ్డులో ఉంటున్నారు. ప్రకాష్‌బాబు విద్యాభ్యాసం అంతా జగ్గయ్యపేటలో జరిగింది. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో లైఫ్‌సైన్సెస్, బయోటెక్నాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. పలు అంతర్జాతీయ యూనివర్సిటీలకు కో-ఆప్షన్ సభ్యుడిగా ఉన్నారు. ఆయన సతీమణి అన్విత యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో రీసెర్చ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇద్దరు కుమారులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు.

నెట్టెం, తాతయ్య, ఉదయభానుల అభినందన

యోగి వేమన వర్సిటీ వైస్‌చాన్సలర్‌గా నియమితులైన ఫణితి ప్రకాష్‌బాబుకు విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఎస్జీఎస్ కళాశాల చైర్మన్, జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభానులు అభినందనలు తెలిపారు.

ప్రకాష్‌బాబు చిన్నప్పటి నుంచి ఏదైనా కష్టపడి సాధిస్తాడని తండ్రి డానియేల్ అన్నారు. ప్రకాష్‌బాబు జీవిత లక్ష్యం నెరవేరిందని, వీసీ పదవి వరించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమ ఆనందం, మాటల్లో చెప్పలేనిదని తల్లి సత్యవతమ్మ అన్నారు.


రిజిస్ట్రేషన్ సర్వర్స్ బంద్!

» ఈ - సైన్ సమస్యలతో నిలిచిన కార్యకలాపాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సర్వర్ సమస్యలతో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. బుధవారం పనివేళల్లో కేవలం అర్ధగంట మాత్రమే సర్వర్ పనిచేసింది. ఉదయం నుంచే సర్వర్ సమస్యలు తలెత్తాయి. మధ్యాహ్నం వరకు ఒక్క రిజిస్ట్రేషన్ కూడా జరగలేదు. మధ్యాహ్నం 2.30 గంటలకు సర్వర్ వచ్చినా ఆ తర్వాత 3 గంటలకు మళ్లీ మొరాయించింది. దీంతో సిబ్బంది కూడా బయటకు వెళ్లిపోయారు. సర్వర్ సమస్యకు ప్రధానంగా ఇ-సైన్ కారణమని తెలుస్తోంది. దీంతో విజయవాడలో పట్టుమని పది రిజిస్ట్రేషన్లు కూడా జరగలేదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

డాక్యుమెంట్ రైటర్ ఇంట్లో చోరీ

» రూ.13 లక్షల బంగారం అపహరణ



చోరీ పరిశీలిస్తున్న ఏసీపీలు తిలక్, క్రైమ్ డీసీపీ వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మహా కుంభమేళాకు వెళ్లిన డాక్యుమెంట్ రైటర్ ఇంట్లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రూ.13లక్షలు విలువ చేసే ఆభరణాలు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం విష్ణుప్రియనగర్‌లో నివాసం ఉంటున్న డాక్యుమెంట్ రైటర్ సీహెచ్ ప్రసాద్ కుంభమేళాకు కుటుంబంతో కలిసి కారులో విజయవాడ వెళ్లాడు. రాత్రి గం.2ల సమయంలో ఇంట్లో సీసీ కెమెరాల నుంచి దృశ్య సమాచారం రాకపోవటంతో బుధవారం ఉదయాన్నే సమీపంలో ఇళ్ల వారికి ఫోన్‌చేసి సీసీ కేబుల్స్‌ను చూడాలని కోరాడు. ఇంటి తలుపులు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్టు తెలుసుకున్న యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగంతకులు మూడు తలుపులు తాళాలు తీసి బీరువాలో ఉంచిన నగలు చోరీచేశారు. సీసీ టీవీ దృశ్యాలు నమోదుచేసే హార్డ్ డిస్క్‌ను ఎత్తుకు వెళ్లారు. నందిగామ ఏసీపీ తిలక్, క్రైమ్ వింగ్ డీసీపీ వెంకటేశ్వర్లులు సంఘటన స్థలికి వచ్చి పరిశీలించారు. సీఐ పీ.వెంకటేశ్వర్లు ఎస్సై జీ.రాజులు వారి వెంట ఉన్నారు.

గన్నవరం రాజకీయ చరిత్రలో బ్లాక్ డే

(5వ పేజీ తరువాయి)

అభ్యర్థిగా నిలిచారు. ఇదిచూస్తే అరాచక శక్తుల పట్ల నియోజకవర్గ ప్రజలు ఎలాంటి భావనతో ఉంటారన్నది అర్థం చేసుకోవచ్చు.

టీడీపీ కార్యాలయంపై దాడితో అట్టుడికిన పట్టణం

నియోజకవర్గంలో పైనచెప్పుకున్న అరాచకాలన్నీ కొనసాగుతున్న దశలో.. ఫిబ్రవరి 20, 2023న వైసీపీ రౌడీ మూకలు టీడీపీ కార్యాలయంపై ఒక్కసారిగా దాడి చేశాయి. ఆ రోజున గన్నవరం అట్టుడికిపోయింది. వైసీపీ రౌడీ మూకలు 150 మంది వరకు టీడీపీ కార్యాలయంపై దాడికి తెగబడ్డారు. కార్యాలయంలోకి చొచ్చుకెళ్లి అక్కడ ఉన్న కార్లను ధ్వంసం చేశారు. ఒక కారుకు నిప్పటించారు. మరో మూడు కార్లను ధ్వంసం చేశారు. మూడు బైక్‌లను నాశనం చేశారు. ఆ తర్వాత టీడీపీ కార్యాలయం అద్దాలు, కంప్యూటర్లను పగులగొట్టారు. కుర్చీలను విరగ్గొట్టారు. చివరగా కార్యాలయానికి నిప్పు పెట్టే ప్రయత్నం కూడా చేయటంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవటంతో దహనం ఆగింది.

ఎన్‌హెచ్-16పై స్వైర విహారం

టీడీపీ ఆఫీసుపై దాడి చేస్తున్న విషయం తెలుసుకుని ఆ పార్టీ శ్రేణులు కూడా పెద్ద ఎత్తున తమ కార్యాలయానికి తరలివచ్చాయి. అప్పటికే కార్యాలయాన్ని ధ్వంసం చేసి ఎన్‌హెచ్-16 మీదకు వచ్చిన వైసీపీ అల్లరి మూకలు.. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కనపడగానే దాడి చేశాయి. టీడీపీ నేత పట్టాభిపై దాడి చేయబోగా టీడీపీ నాయకులు తప్పించారు. ఈ క్రమంలో ఎంతో మంది కార్యకర్తలు వైసీపీ రాళ్ల దాడిలో గాయాలపాలయ్యారు. కర్రలు, రాళ్లతో విచక్షణా రహితంగా వైసీపీ మూకలు దాడి చేశాయి. ఎన్‌హెచ్-16 మీద వైసీపీ మూకల దాడులను ప్రత్యక్షంగా చూసిన ప్రజలు భీతిల్లారు. పట్టణంలో తీవ్ర భయాందోళన పరిస్థితులు ఏర్పడ్డాయి. దుకాణాలు కట్టివేయటంతో పాటు ఆ రోజున బయటకు రావటానికి ప్రజలు భయపడ్డారు.

నాటి పాలకులకు సలాంగిరీ చేసిన పోలీసులు

టీడీపీ కార్యాలయంపై దాడి జరుగుతుందన్న సమాచారం అప్పటి పోలీసులకు అందింది. కానీ వారు టీడీపీ కార్యాలయానికి ఎటువంటి ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేయలేదు. టీడీపీ నేత దొంతు చిన్నా ఇంటిపై వైసీపీ మూకలు దాడి చేయటం, మిగిలిన నేతలపై కూడా దాడులకు పాల్పడబోతున్నారన్న సమాచారంతో గన్నవరం పోలీస్ స్టేషన్‌లో టీడీపీ నాయకులంతా కలిసి ఫిర్యాదు చేయటానికి వెళ్లారు. ఆ సమయంలో టీడీపీ కార్యాలయంపై దాడి జరిగింది. పోలీస్ స్టేషన్‌లో ఉండగా.. దాడి జరిగిందన్న ఉద్దేశ్యంతో అక్కడి నుంచి వెళ్లిన టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకలు విరుచుకుపడ్డాయి. ఈ ఘటనలో తప్పు చేసిన వారిని వదిలేసి .. టీడీపీ నేతలపై ఎదురు కేసులు పెట్టడం గమనార్హం.

కూటమి ప్రభుత్వం రాకతో విచారణ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది నవంబరులో కేసును సీఐడీకి బదిలీ చేయడంతో విచారణ వేగం పుంజుకుంది. ఈ కేసులో మొత్తం 93 మంది నిందితుల్లో 49 మందినే అరెస్టు చేశారు. మరో 31 మంది మాత్రం అరెస్టు కాకుండా తప్పించుకున్నారు. ఇంకా 13 మందిని అరెస్టు చేయాల్సి ఉండగా, వారు అజ్ఞాతంలో ఉన్నారు. ఈ కేసులో అత్యంత కీలకమైన వంశీ మాత్రం హైకోర్టు నుంచి ఇంటీరియం ఆర్డర్ తెచ్చుకున్నారు. చివరికి సత్యవర్ధన్ ఎపిసోడ్‌తో అరెస్టు కావాల్సి వచ్చింది. ఆ రోజున టీడీపీ ఆఫీసు దాడిలో పాల్గొన్న వైసీపీ రౌడీ మూకలు భయపడి ఇప్పుడు లొంగిపోతున్నాయి.

నాటి దాడి ఘటన భయానకం

(గన్నవరం, హనుమాన్‌జంక్షన్ రూరల్)

గన్నవరంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై నాటి దాడి ఘటన అత్యంత భయానకమని బాధితులు పేర్కొంటున్నారు. అరాచకానికి పరాకాష్టగా నిలిచిపోతుందంటున్నారు. నాటి బ్లాక్ డేను గుర్తు చేసుకుని కన్నీరు పెడుతున్నారు. అప్పటి బాధితులు, టీడీపీ నాయకులు 'ఆంధ్రజ్యోతి'తో తమ అనుభవాలను పంచుకున్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

64 రోజులు అజ్ఞాతంలో గడిపా

- జాస్తి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు



2019 తర్వాత వైసీపీ పంచన చేరిన వంశీ చేయని అరాచకాలు లేవు. టీడీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులు, ఆస్తులు ధ్వంసం చేయటం, కేసులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారు. పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేసి కార్యకర్తలను కొట్టి వారిపైనే కేసులు పెట్టారు. 64 రోజులు అజ్ఞాతంలో గడిపా. వంశీ పాపం పండి జైలులో ఉన్నాడు. చదువుకునే వారిని కూడా కేసుల్లో ఇరికించాడు. నా పొలంలోకి అక్రమంగా చొరబడి రేకుల షెడ్డును ధ్వంసం చేయించాడు.

రాయితో ముఖం మీద కొట్టారు

-మండవ లక్ష్మి, తెలుగు మహిళ కార్యదర్శి



నన్ను భీమవరపు రాము పట్టుకుంటే ఓలుపల్లి రంగా రాయితో ముఖంపై కొట్టాడు. మూల్పూరి ప్రభుకాంత్ డబ్బా విసిరాడు. నన్ను చంపాలని చూశారు. స్పృహ తప్పి పడిపోయిన నన్ను రాము కాళ్లతో తంతూ భూతులు తిట్టాడు. గాయాలతో ఆస్పత్రికి వెళ్లగా అక్కడికి పోలీసులు వచ్చారు. వైద్యం తీసుకోకుండానే పారిపోవాల్సి వచ్చింది. కొట్టి పైగా కేసులు పెట్టారు. వైసీపీలోకి వెళ్లలేదని వంశీ ఎన్నో ఇబ్బందులకు గురిచేశాడు. ఇల్లు వదిలి పారిపోవాల్సిన దుస్థితి. పోలీసులు కూడా వంశీ చెప్పిందే వేదంగా చేశారు.

దొంతు చిన్నా ఇంటిపై ముందుగా దాడి

- మూల్పూరి సాయికళ్యాణి, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



దొంతు చిన్నా లేని సమయంలో ఆయన ఇంటిపై ముందుగా దాడిచేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లాం. అదే సమయంలో టీడీపీ కార్యాలయంపై దాడి జరుగుతోందని, కార్లు తగలబెడుతున్నారని ఫోన్ వచ్చింది. కార్యాలయాన్ని రక్షించుకునేందుకు పట్టాభి తదితరులతో కలిసి నడుచుకుంటూ వెళ్తుంటే సుమారు 150 మందికి పైగా వైసీపీ గుండాలు మహిళలని కూడా చూడకుండా కర్రలు, ఇనుపరాడ్లు, రాళ్లతో మాపై దాడికి దిగారు. కొంతమందికి గాయాలయ్యాయి.

ఇల్లు వదిలి పారిపోవాల్సి వచ్చింది

- చిరుమామిళ్ల సూర్యనారాయణప్రసాద్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి



దొంతు చిన్నాను పరామర్శించేందుకు ఫోన్ చేశా. టీడీపీ కార్యాలయంలో ఉన్నానని చెప్పడంతో అక్కడికి వెళ్లా. నాయకులందరం కలిసి స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లాం. ఆ సమయంలో కార్యాలయంపై దాడి జరుగుతున్నట్లు తెలిసింది. కార్యాలయాన్ని రక్షించుకునేందుకు వెళితే కార్లు తగలబడుతూ కనిపించాయి. ఇంతలో వైసీపీ వారు మాపై రాళ్ల దాడికి దిగారు. పోలీసులు టీడీపీ నాయకులపైనే తిరిగి కేసులు నమోదు చేశారు. దీంతో సుమారు 40రోజుల పాటు ఇల్లు, కుటుంబాలను వదిలి దాక్కోవలసిన పరిస్థితి. మానసికంగా, శారీరకంగా పడిన ఇబ్బంది జీవితంలో ఇంతవరకూ ఎప్పుడూ అనుభవించలేదు.



వెండిని స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు

బిల్లులు లేని 107 కిలోల వెండి స్వాధీనం

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే పోలీసులు మంగళవారం తనిఖీలు చేస్తున్న క్రమంలో బిల్లులు లేకుండా రవాణా అవుతున్న 107 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్‌లో ఆగ్రా నుంచి వెండిని విజయవాడకు తరలిస్తుండగా పోలీసుల తనిఖీలో పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న వెండి విలువ సుమారు కోటి రూపాయలుంటుందని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ జేవీ రమణ మాట్లాడుతూ, రవాణా అవుతున్న వెండికి సంబంధించి ఎటువంటి పత్రాలు లేవని, దీంతో వెండిని జీఎస్టీ అధికారులకు అప్పగిస్తామని తెలిపారు.

కేజీబీవీ పాఠశాల ఎస్‌వో, ఏఎన్‌ఎంల సస్పెన్షన్

ఎ.కొండూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలోని ప్రత్యేక అధికారి, ఏఎన్‌ఎంలను సస్పెండ్ చేస్తూ బుధవారం కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. పాఠశాలలో గత కొంత కాలంగా ఎస్‌వో, ఉపాధ్యాయులు, సిబ్బంది మధ్య అంతర్గత విభేదాలతో ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నారు. ఫిర్యాదులపై కలెక్టర్ ఆదేశాలమేరకు ఈనెల 11న తిరువూరు ఆర్డీవో కె.మాధురి కేజీబీవీలో సమగ్ర విచారణ చేసి నివేదికను అందజేశారు. నివేదిక ప్రకారం ఎస్‌వో మీరున్నిసా బేగం, ఏఎన్‌ఎం మమతలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఇన్‌చార్జి బాధ్యతలు ఎ.కొండూరు ఎస్టీ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, కవితకు, రెడ్డిగూడెం, రంగాపురం కేజీబీవీ పాఠశాల ఏఎన్‌ఎం సౌందర్యకు అప్పగించారు.

రాజుకుంటున్న ఎమ్మెల్సీ ఎన్నికల వేడి

(5వ పేజీ తరువాయి)

కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం పెద్దల ఆదేశాలతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మంత్రులు, శాసన సభ్యులు, జనసేన నాయకులు కొద్దిరోజులుగా ఆలపాటి గెలుపుకోసం ప్రతి నియోజకవర్గంలోనూ ప్రచారం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎన్నికల వ్యూహాన్ని అమలు చేస్తుండటంతో పీడీఎఫ్ అభ్యర్థి కొంతమేర ప్రచారంలో వెనుకబడ్డారని సమాచారం.

ఎన్నికల ఫలితాలపై ఉపాధ్యాయుల ప్రభావం

ఎన్నికల ఫలితాలపై ఉపాధ్యాయుల ప్రభావం స్పష్టంగా ఉండనుంది. పట్టభద్రుల ఓటర్లుగా ఉపాధ్యాయులు, వారి కుటుంబసభ్యులు అధికంగా నమోదై ఉన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వం వైపే మొగ్గు చూపినట్టుగా పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపులో రుజువైంది. ప్రస్తుతం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగుల వైఖరి ఎలా ఉంటుందనే అంశంపై చర్చ జరుగుతోంది. ఉపాధ్యాయ వర్గానికి చెందిన కేఎస్ లక్ష్మణరావు నాలుగోసారి పోటీలో ఉండటతో ఆయనను ఈసారి ఎంతమేర పట్టభద్రులు ఆదరిస్తారనే అంశంపైనా చర్చనడుస్తోంది. ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలు, పీఆర్‌సీ బకాయిలు, కరువుభత్యం తదితర ఈ అంశాలనే లక్ష్యంగా చేసుకుని కొందరు టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెరవెనుక కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. వైసీపీ తన అభ్యర్థిని నిలబెట్టకపోయినా గుట్టుచప్పుడు కాకుండా ఈ అంశాలపై తనదైన శైలిలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెరవెనుక పావులు కదుపుతోంది.

జిల్లాలో 63,143 మంది ఓటర్లు

జిల్లాలో పట్టభద్రుల ఓటర్ల జాబితా పరిశీలిస్తే పురుషులు 35,343 మంది, మహిళలు 27,796 మంది, ఇతర ఓటర్లు నలుగురు ఉన్నారు. జిల్లాలోని 77 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. గుడివాడ డివిజన్‌లో 23, మచిలీపట్నం డివిజన్‌లో 28, ఉయ్యూరు డివిజన్‌లో 25 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో 92 మంది పీవోలు, 92 మంది ఏపీవోలు, 199 మంది ఓపీవోలను నియమించారు. మైక్రో అబ్జర్వర్లు 92 మంది, సెక్టార్, రూట్ ఆఫీసర్లు 15 మందిని ఏర్పాటు చేశారు. కలెక్టర్ బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు నేతృత్వంలో అధికారులు, సిబ్బంది ఎన్నికల నిర్వహణకు సిద్ధమయ్యారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95,104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 430

పెరుగుతున్న భక్తుల రద్దీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వీరమ్మ తిరునాళ్లలో భక్తుల రద్దీ పెరుగుతుంది. ఈ నెల 8న ప్రారంభమైన తిరునాళ్ల శనివారంతో ముగియనుండగా అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు పలు ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. తిరునాళ్లలో 12వ రోజైన బుధవారం వేకువ జాము నుంచి రాత్రి వరకు ఆలయం వద్ద భక్తుల రద్దీగా కన్పించింది. పెద్దయెతున తరలివచ్చిన భక్తులు పొంగళ్లతో క్యూలైన్లలో కొచుని అమ్మవారిని దర్శించి మొక్కు తీర్చుకున్నారు. పాటేళ్లతో సందడిగా వచ్చి ఆలయం వద్ద మొక్కుబడి చెల్లించుకుంటున్నారు.


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

నీళ్లు నములుతున్నారు

- కానూరు వినాయక్‌నగర్ వాటర్ ట్యాంక్ వద్ద నీటి లీకులు
- వృథాగా పోతున్న తాగునీరు
- పార్కు రోడ్డుపై ప్రవాహం
- ఇబ్బందులు పడుతున్న చిన్న పిల్లలు, వాకర్లు
- పట్టించుకోని అధికారులు


పైపుల లీకులతో వృథాగా పోతున్న తాగునీరు

(పెనమలూరు - ఆంధ్రజ్యోతి)

నెల రోజులుగా కానూరు వినాయక్‌నగర్ ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద పైపుల లీకులతో నీళ్ల వృథా అవుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో ఆప్రాంత చిన్నారులు, పాదచారులు, వాకర్లు పలు ఇబ్బందులు పడుతున్నారు. వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వినాయక్‌నగర్‌లోని వాటర్ ట్యాంకు కానూరులోని నవతారోడ్డు ప్రాంత ప్రజలకు ఆధారం. ప్రతిరోజూ ఉదయం 5.30 నుంచి 11గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 8.30 వరకు నీళ్ల గ్రామంలోకి వదులుతారు. ట్యాంకు కింద భాగంలో నేలపై ట్యాంకులోకి నీటిని పంపించే పైపులు లీకవుతుండడంతో నీళ్ల రోడ్డుపైన, పార్కులోనూ ప్రవహిస్తున్నాయి. నెల రోజులుగా నీరు లీకవుతున్నా ఈ విషయంపై దృష్టి సారించిన అధికారులు లేరు. నెల క్రితం స్థానికులు అప్పటి ఏఈ సాయిగణేష్‌కు సమస్యలపై నివేదించారు. ఆయన బదిలీపై వెళ్లడం, అతని స్థానే రవికుమార్ బాధ్యతలు చేపట్టడంతో స్థానికులు మళ్లీ ఏఈ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఇదుగో అదుగో అంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారే తప్ప సమస్యను పరిష్కరించలేదని, తాము ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పేర్కొన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు త్వరలో పరిష్కారం చూపుతారని స్థానికులు ఎదురు చూస్తున్నారు.

రేపు విద్యుత్ అదాలత్

కంకిపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రాయల్ ఫంక్షన్ హాల్‌లో 21న విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 21న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ అదాలత్ కొనసాగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెనమలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి దృష్ట్యా యనమలకుదురు సబ్‌స్టేషను పరిధిలో ఉన్న 11కేవీ కెనాల్ బ్యాంక్ ఫీడరు, 11కేవీ లాకులు ఫీడరు పరిధిలో లైన్ల మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 7.30 నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గుణదల ఈఈ హరిబాబు తెలిపారు. డొంకరోడ్డులోని లాకుల ఏరియా, ఇందిరానగర్ 2, పైడయ్య వీధి, పార్థసారథి కళ్యాణ మండపం ఏరియా వినియోగదారులు సహకరించాలని కోరారు.


శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మైత్రీ భారతి సభ్యులు

ఘనంగా ఛత్రపతి శివాజీ, సంత్ సేవాలాల్ జయంతి

హనుమాన్‌జంక్షన్,ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల దశ దిశను మార్చడానికి కృషి చేసిన సంత్ సేవాలాల్ మహరాజ్, ఛత్రపతి శివాజీ మహారాజ్‌లు చిరస్మరణీయులని గిరిజన సంఘం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి భూక్యా పార్వతి భాయ్ అన్నారు. బుధవారం స్థానిక విజయవాడ రోడ్డులో మైత్రీ భారతి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ, సంత్ సేవాలాల్ మహరాజ్‌ల జయంతి వేడుకను నిర్వహించారు. వారి చిత్రపటాలకు మైత్రీ భారతి సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మైత్రి భారతి గన్నవరం సబ్ డివిజన్ కన్వీనర్ యడవల్లి పాండురంగారావు, సభ్యులు మోరంపూడి అప్పలరాజు, ఎస్సీ ఎస్టీ యూత్ కన్వీనర్ బేతపూడి పవన్‌కుమార్, మొవ్వా వేణు, చలసాని ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ తాతాజీ

రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలి

ఉయ్యూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయ సంఘాల మహిళలు రుణాలు సక్రమంగా వినియోగించుకుని ఆర్థిక స్థితిగతులు మెరుగుపరుచుకోవాలని యూనియన్ బ్యాంకు మచిలీపట్నం రీజనల్ హెడ్ తాతాజీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన స్వయం సహాయ సంఘాల మహిళల రుణ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అధిక వడ్డీల భారిన పడకుండా తక్కువ వడ్డీకి బ్యాంకులు ఇస్తున్న రుణాలు తీసుకోవాలన్నారు. రీజనల్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఎంపీడీవో శేషగిరిరావు, ఏపీఎం అమర్, బ్యాంక్ బీఎం వినేశ్‌రావు, వీఏవోలు పాల్గొన్నారు.


బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు

సమ్మె విజయవంతం చేయండి

కంకిపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బ్యాంక్ యూనియన్ నాయకులు రామకృష్ణ అన్నారు. బుధవారం కంకిపాడులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ఇతర ఉద్యోగులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 24, 25 తేదీల్లో సమ్మె చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. బ్యాంకుల్లో నెలకొన్న అన్ని సమస్యలు పరిష్కారంతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులు తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవి, హారిక తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గుడివాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయాల గుడివాడ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్-2025ను బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆవిష్కరించారు. అనంతరం ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావులను కలిసి క్యాలెండర్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చాట్రగడ్డ రాజు, కార్యదర్శి జి.శంకరరావు పాల్గొన్నారు.


టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా అందుకుంటున్న తిప్పనగుంట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మాదాల శ్రీనివాసరావు

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధితో పాటు పేదలకు సంక్షేమం సకాలంలో అందజేయడం టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. తిప్పనగుంట పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మాదాల శ్రీనివాసరావు రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టినా రైతులకు సకాలంలో ధాన్యం డబ్బులు అందజేయడంతో పాటు మహిళలకు, యువతకు వివిధ సంక్షేమ పథకాలను అందజేయడం కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు వద్రాణం హరిబాబునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, కార్యదర్శి పుట్టా సురేష్, మొవ్వా వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


దీక్షలో పీటీడీ ఉద్యోగులు

కొనసాగుతున్న పీటీడీ ఉద్యోగుల దీక్షలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : డిపో పరిధిలో జరిగిన అక్రమ చార్ట్ కౌన్సెలింగ్‌కు నిరసనగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేస్తున్న రిలే దీక్ష బుధవారం 6వ రోజుకు చేరుకుంది. అసోసియేషన్ డిపో అధ్యక్షుడు కేఎస్ రావు దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిబంధలనకు విరుద్ధంగా ఇష్టానుసారంగా చార్ట్ కౌన్సెలింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చార్ట్ కౌన్సెలింగ్ రద్దు చేసే వరకు ఆందోళన ఆపేదిలేదని స్పష్టం చేశారు. పీఎన్‌వీ వాసు, కేవీ రత్నం దీక్షలో కూర్చోగా అసియేషన్ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్ రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీ టీవీఆర్ ప్రసాద్, పాండవులు, వైస్ చైర్మన్ పిచ్చయ్య, కమిటీ సభ్యుడు ఎల్ఎస్ రావు, రంగమ్మ, పార్వతి, శ్రీలత తదితరులు పాల్గొని మద్దతు పలికారు.

చిన్నారులకు మంచి నడవడిక నేర్పించాలి

జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో కె. జోగేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అంగన్వాడీ చిన్నారుల్లో మంచి నడవడికతోపాటు విషయ పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలని అంగన్వాడీలకు బాపులపాడు ఎంపీడీవో కె. జోగేశ్వరరావు దిశానిర్దేశం చేశారు. బుధవారం స్థానిక బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు 120 రోజుల జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమంలో భాగంగా 81మందికి మొదటి ఆరు రోజుల శిక్షణా తరగతులను ఎంఈవో రాంబాలసింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అంగ న్వాడీలు సేవలందించాలన్నారు. చిన్నారులకు బోధించే అంశాలపైన జాతీయ విద్యావి ధానం లక్ష్యాలను రిసోర్సు పర్సన్స్ రాజారత్నం, దేవి, శివశంకర్ రెడ్డిలు అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టీవీ.నాగేశ్వరరావు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు శాంతిశిరీష, ధనలక్ష్మి, డీఆర్పీలు, సీఆర్పీలు, పాల్గొన్నారు.


కొనసాగుతున్న రోడ్డు అభివృద్ధి పనులు

రహదారులకు మహర్దశ

శరవేగంగా సాగుతున్న గన్నవరం- మానికొండ రోడ్డు పనులు

(ఉంగుటూరు- ఆంధ్రజ్యోతి)

మండలంలో రోడ్లన్నీ గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఎలాంటి మరమ్మతులకు నోచుకోక గతుకులు, గోతులతో అధ్వానంగా తయారయ్యాయి.

గన్నవరం-మానికొండ ఆర్‌అండ్‌బీ రహదారి అడుగడుగునా గుంతలమయమై పూర్తిగా ధ్వంసమైంది. గత కొన్నేళ్లుగా ఎలాంటి మరమ్మతులకు నోచుకోక రోడ్డు రూపురేఖలు కోల్పోయి దారుణంగా దెబ్బతింది. గన్నవరం నుంచి వయా కేసరపల్లి, బుద్ధవరం, తరిగొప్పల, మానికొండ మీదుగా ఉయ్యూరు, గుడివాడకు నిత్యం వివిధ వాహనాల్లో రాకపోకలు సాగించే ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చొరవతో రోడ్డు అభివృద్ధి పనులు ముందుకు సాగటంతో ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సుమారు 12కోట్ల సీఆర్ఐఎఫ్ నిధులతో బుద్ధవరం మట్టివంతెన నుంచి తరిగొప్పల వరకు సుమారు ఐదుకిలోమీటర్ల మేర తారురోడ్డు, తరిగొప్పల నుంచి మానికొండ వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల రోడ్డుకు మరమ్మతు(ప్యాచ్‌వర్క్)పనులు చేపట్టారు. తొలివిడతగా తరిగొప్పల 460 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించారు. ఆతర్వాత తరిగొప్పలనుంచి బుద్ధవరం మట్టివంతెన వరకు ధ్వంసమైన రోడ్డును తొలగించి రబ్బీష్, గ్రావెల్, కంకర చిప్స్, డస్టను లేయర్లుగా వేస్తూ 5.5.మీటర్ల వెడల్పుతో రోడ్డును అభివృద్ధి పరుస్తున్నారు. దీనిపై తారువేసిన అనంతరం తరిగొప్పలనుంచి మానికొండవరకు రోడ్డు ప్యాచ్‌వర్క్‌పనులు చేపట్టనున్నారు.


జైరుద్రను అభినందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

చిన్నారి జైరుద్రకు ఎమ్మెల్యే బోడె అభినందన

- కాలభైరవాష్టకంలోని దివ్య శ్లోకాలను పఠించడంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించిన జైరుద్ర

పెనమలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కాలభైరవాష్టకంలోని దివ్య శ్లోకాలను అత్యంత వేగంగా పఠించిన చిన్నారిగా పోరంకికి చెందిన ఐదేళ్ల జైరుద్ర ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. చిన్నారి జైరుద్ర, తల్లి జ్ఞానశ్రీలను బుధవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అభినందించారు. 2019లో జన్మించిన జైరుద్ర ఐదేళ్లకే కాలభైరవాష్టకంలోని 9దివ్య శ్లోకాలను రెండు నిమిషాల 50 సెకండ్లలో పఠించి రికార్డు సృష్టించాడు. జైరుద్రకు చిన్నతనం నుంచి విషయాలు విని కంఠస్తం చేయడం ద్వారా నేర్చుకొనే సామర్థ్యం ఎక్కువగా ఉండేదని, అది గ్రహించిన తల్లి కోగంటి జ్ఞానశ్రీ శ్లోకాలు, స్తోత్రాలు వినిపిస్తూ నేర్పించేది. అది అతనికి రికార్డు సాధించడంలో సాయపడిందని కుటుంబ సభ్యులు తెలిపారు. రుద్ర హనుమాన్ చాలీసా, శివతాండవ స్తోత్రం, పంచాక్షర స్తోత్రాలను సులభంగా పఠించగలడని తెలిపారు.

నాడు- నేడు పనులు వేగవంతం చేయాలి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాఠశాలల్లో రెండవ విడత చేపట్టిన నాడు - నేడు పెండింగ్ పనులను వేగవంతం చేయాలని బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్ హెచ్‌ఎంలను ఆదేశించారు. బుధవారం ఎంఈవో తన కార్యాలయంలో 2022-23లో మంజూరు చేసిన 26 పాఠశాలల్లో చేపట్టిన నాడు- నేడు పనులపై సమీక్ష చేశారు.పనులు పూర్తై నిధులు మిగిలితే పెండింగ్‌లో ఉన్న పాఠశాలకు కేటాయించాలని సూచించారు. పెండింగ్ పనులు పూర్తి చేయడానికి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శ్రద్ధ వహించాలని తెలిపారు. సమావేశంలో సీఎంఓ రమేశ్, పీఆర్ ఏఈ జయరాజు, పలు పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

పెనమలూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల సమస్యలు తెలిసిన అనుభవజ్ఞుడైన ఆలపాటి రాజాను ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించి పెద్దల సభకు పంపుకోవాలని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర పిలుపు నిచ్చారు. బుధవారం ఆమె స్థానిక నాయకులు అంగిరేకుల మురళి, వల్లభనేని శరత్, నరసింహరావులతో కలిసి కాలనీలో ఇంటింటికీ తిరిగి విస్తృత ప్రచారం నిర్వహించారు.

ఉయ్యూరు : ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి విజయం చేకూర్చాలని కోరుతూ పార్టీ నాయకుడు పోతురెడ్డి ఆధ్వర్యంలో పెదఓగిరాల జడ్పీ హైస్కూల్‌లో కూటమి నాయకులు బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. డి శివప్రసాద్, శ్రీనివాసరెడ్డి, ప్రసాదరెడ్డి, సాంబ శివరావు ప్రచారంలో పాల్గొ న్నారు.

గన్నవరం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావేత్త ఆలపాటిని గెలిపించుకోవాలని నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు కోట వీరబాబు అన్నారు. గన్నవరం పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం విస్తృత ప్రచారం చేశారు. టీడీపీ మండల కార్యదర్శి బోడపాటి రవికుమార్, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమాదేవి, కంభంపాటి లక్ష్మీ, బుస్సే సరితాదేవి, తంగిరాల శ్రీనివాసరావు, నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎన్నెస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ కోరారు. రంగన్నగూడెంలో పట్టభద్రులను బుధవారం కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పునులూరి లక్ష్మీనారాయణ, పాల సొసైటీ అధ్యక్షుడు మొవ్వా శ్రీనివాసరావు, నత్తా అబ్రహం, కనకవల్లి శేషగిరిరావు, వేణుబాబు, మందపాటి రాంబాబు, సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

- ఆరుగొలను, కానమోలుల్లో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబుతో కలిసి మూల్పూరి సాయికళ్యాణి, వీరమాచినేని సత్యప్రసాద్ తదితరులు ఎమ్మెల్సీ ఓట్లను అభ్యర్థిస్తూ ప్రచారం నిర్వహించారు. జాస్తి భూపతి రావు, వడ్డి శివనాగేశ్వరరావు, షేక్ అహ్మద్, సూర్యావతి పాల్గొన్నారు.


కానూరు కేసీపీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న యార్లగడ్డ సుచిత్ర.. రంగన్నగూడెంలో ఆళ్ల ప్రచారం



గొప్పలు కాదు తిప్పలు!

తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో అసంపూర్తిగా నాడు-నేడు పనులు




ఫేజ్-1లో ఇలా అసంపూర్తిగా గదుల నిర్మాణం



ఫేజ్-2లో చేపట్టిన నిర్మాణం కూడా అసంపూర్తిగానే

నాడు-నేడులో భాగంగా పాఠశాలలన్నింటినీ సుందరంగా అభివృద్ధి చేశామని నాటి వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. అయితే రంగులు వేయటంలో చూపిన వేగం భవన నిర్మాణాలు పూర్తి చేయటంలో చూపలేదని తెలుస్తోంది. భవనాలు నిర్మిస్తామంటూ నిధులు కేటాయించటం సగం పనులు పూర్తయ్యాక నిధులు ఆపేయటం, ఇంకోసారి నిధులు కేటాయించటం మళ్లీ సగం పనులు పూర్తయ్యాక నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి నిర్మాణాలు అక్కడే ఆగిపోయి మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - ఆంధ్రజ్యోతి, తోట్లవల్లూరు

- వెక్కిరిస్తున్న మొండి గోడలు.. శ్లాబు నుంచి ఊడి పడుతున్న పెచ్చులు
- 395 మంది విద్యార్థులున్న హైస్కూల్లో అన్నీ అసౌకర్యాలే
- సుందరంగా చేశామని నాటి వైసీపీ ప్రభుత్వం ప్రగల్భాలు



పెచ్చులు ఊడి చువ్వలు కనిపిస్తున్న పైకప్పు

తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో ఫేజ్-1, ఫేజ్-2లో చేపట్టిన రెండు భవనాలు నేటికీ మొండిగోడలతోనే దర్శనమిస్తున్నాయి. హైస్కూల్లో 395 మంది విద్యార్థులున్నారు. గతంలో నిర్మించిన రేకులషెడ్డులు శిథిలావస్థకు చేరటంతో వాటిని తొలగించేశారు. దీంతో విద్యార్థులకు తరగతి గదుల సమస్య ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వ సంస్కరణల్లో భాగంగా ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతి విద్యార్థులను కూడా హైస్కూల్లో కలిపారు. అసలే గదులు లేక ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు ప్రాథమిక విద్యార్థులను తీసుకురావడంతో వారంతా ఇరుకు గదుల్లో మగ్గాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో నాడు - నేడు ఫేజ్-1లో భాగంగా రూ.87.75 లక్షలను అదనపు తరగతి గదుల నిర్మాణానికి, ఇతర భవనాల రిపేర్లకు కేటాయించారు. పడమర వైపున పాత భవనం శ్లాబుపై అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టి పిల్లర్లు పోసి అలాగే వదిలేశారు. ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు వినియోగించే కార్యాలయం భవనం శ్లాబు పూర్తిగా బలహీనపడి పెచ్చులూడి పడుతున్నాయి. హైస్కూల్లోకి వచ్చే విద్యార్థులు ఈ భవనం నుంచే రావాల్సి ఉంది. అయినా శ్లాబుకి మరమ్మతులు చేపట్టలేదు. ఫేజ్-1లో కేటాయించిన రూ.87.75 లక్షల్లో కేవలం రూ.38.19 లక్షలు మాత్రమే వినియోగించారు. మళ్లీ ఫేజ్-2లో భాగంగా మళ్లీ నూతన తరగతుల భవనం నిర్మిస్తామంటూ రూ.1.19 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో నూతన భవనం పిల్లర్లపై శ్లాబు వరకు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. ఇందులోనూ కేవలం రూ.28.87 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. నిధులు సకాలంలో విడుదల చేయకపోవడం వల్లే నిర్మాణాలను పూర్తి చేయించలేకపోయినట్టు గత ప్రభుత్వంపై విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి నిధులు కేటాయించి పనులను పూర్తిచేస్తే వచ్చే విద్యా సంవత్సరానికైనా అందుబాటులోకి వస్తాయి.

నాడు - నేడు పనులపై వివరాల సేకరణ

మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్స్ 17 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో మండలంలో నాడు - నేడులో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన పనులపై 17 పాఠశాలల హెచ్ఎంల నుంచి లిఖితపూర్వక వివరాలను సేకరించారు. ఎన్ని నిధులు మంజూరయ్యాయి, ఏయే పనులు చేపట్టారు, అసంపూర్తిగా ఉన్న పనులు, మంజూరు చేసిన నిధులు ఎంత చెల్లించారు, ఆ పనుల బిల్లులు ఆన్‌లైన్ అయ్యాయా అన్న అంశాలపై ఏఎంవోలు వివరాలు తెలుసుకున్నారు. మండలంలో 17 పాఠశాలల్లో మాత్రమే నాడు-నేడు అమలయిందని, ఇందులో తోట్లవల్లూరు హైస్కూల్, దేవరపల్లి, గరికపర్రు పాఠశాలల్లో కొన్ని పనులు అసంపూర్తిగా ఉన్నట్టు ఎంఈవో-1 జి వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 బి సురేష్ సదరు అధికారులకు వివరించారు. ఈ వివరాలను జిల్లాస్థాయిలో క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని, తరువాత అసంపూర్తి పనులపై చర్యలు తీసుకుంటారని ఏఎంవోలు తెలిపారు.



నాడు నేడు పనుల లెక్కల వివరాలను లిఖిత పూర్వకంగా తీసుకుంటున్న ఏఎంవోలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, హాజరైన అధికారులు

మత్స్యకారులకు చేయూతనివ్వండి

- కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన ద్వారా మత్స్యకారులకు తగిన ప్రోత్సాహాన్ని అందించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపుహాలులో బుధవారం మత్స్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మత్స్యకారులకు బోట్లు, వలలు, మోటార్లు, బోట్లలో బయోటాయిలెట్‌లు, కియోస్కమిషన్‌లు, ఐస్‌బాక్సులు, ఐస్‌ప్లాంట్‌లు, సముద్రంలో లోతైన ప్రాంతంలో చేపల వేట కొనసాగించేందుకు అవసరమైన యూనిట్లను మంజూరు చేసేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. ఇప్పటికే ఆయా యూనిట్లలో పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ నగదు వివరాలను నివేదిక రూపంలో అందజేయాలన్నారు. దీంతోపాటు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా లబ్ధిచేకూర్చేందుకు అవసరమైన నివేదికలను అధికారులు త్వరగా తయారు చేయాలన్నారు. మత్స్యశాఖ జేడీ నాగబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ విధుల్లో నిర్లక్ష్యం

- ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్‌కు ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన వీరులపాడు మండలం, గూడెం మాధవరం ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఏ) మన్నే సుధీర్ సస్పెన్షన్‌కు కలెక్టర్ లక్ష్మీశ బుధవారం ఆదేశాలిచ్చారు. గ్రామంలో వేతనదారులకు పనులు కల్పించడంలోనూ సగటు వేతనం విషయంలో జిల్లాలోనే అట్టడుగు స్థానంలో నిలిచినందున, ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విధులకు, సమావేశాలకు హాజరుకానందున క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెన్షన్ ఆదేశాలిచ్చారు. ఈ విషయమై సుధీర్‌కు నోటీసులు కూడా జారీ అయ్యాయి.



వైవీ ఈశ్వరరావును అభినందిస్తున్న డాక్టర్ జీఆర్ షణ్ముగప్ప

దేశానికే తలమానికం రవాణారంగం

- డాక్టర్ జీఆర్ షణ్ముగప్ప

లబ్బీపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశానికే రవాణారంగం తలమానికమని, అసంఘటిత రంగంలోని లారీ యజమానుల ఆశాజ్యోతిగా వైవీ ఈశ్వరరావు చేస్తున్న సేవలు నిరుపమానమని ఆలిండియా మోటారు ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ చైర్మన్, సిమ్టా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీఆర్ షణ్ముగప్ప అన్నారు. ఆలిండియా మోటారు ట్రాన్స్‌పోర్టు కాంగ్రెస్ సౌత్ జోన్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు అభినందన సభ బుధవారం సాయంత్రం లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా, లారీ ఓనర్స్ స్టీరింగ్ కమిటీ కార్యదర్శి పీఎస్‌వీ ప్రసాదరావు, ఏపీ లారీ ఓనర్స్ సంఘం అధ్యక్షుడు పి.గోపాల్ నాయుడు, ప్రధాన కార్యదర్శి అల్లాడ సత్యనారాయణ, లారీ ఓనర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు రావి గోపాలరావు, స్టోర్స్ అధ్యక్షుడు కోనేరు వెంకట రమేష్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, సీపీఎం నగర కార్యదర్శి బాబూరావు పాల్గొని అభినందనలు తెలిపారు.

23, 24న కూచిపూడిలో

ఏఎన్‌పీఈఎఫ్ సమావేశాలు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నాట్యానికి జీవం పోసిన కూచిపూడిలో జాతీయ స్థాయిలో ఆలిండియా న్యూస్ పేపర్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏఎన్‌పీఈఎఫ్) కేంద్ర కమిటీ సమావేశాలు ఈనెల 23, 24 తేదీల్లో జరుగుతాయని ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ చలాది పూర్ణచంద్రరావు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సీడబ్ల్యూసీ ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. ఏపీజేయూ గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రారంభిస్తారన్నారు. ఏపీజేయూ 35వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. సంఘ కోశాధికారి ఆర్డీ ప్రసాద్, నిర్వాహకులు చీకటిమర్ల శివరామ ప్రసాద్, కోనేరు ఆనంద్, బెల్లంకొండ వెంకటేశ్వరరావు ఉన్నారు.

24న పీఎం కిసాన్ నగదు జమ

మచిలీపట్నం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్‌పథకం అమల్లో భాగంగా 2024-25 ఆర్థికసంవత్సరానికి సంబంధించి మూడో విడత నగదు రైతుల ఖాతాల్లో ఈనెల 24న జమ కానుంది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బటన్‌నొక్కి నగదును రైతుల ఖాతాల్లో నేరుగా జమచేయనున్నారు. కృష్ణాజిల్లాలో 1.12 లక్షల మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున రూ.22.49కోట్ల నగదు జమచేయనున్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రభుత్వాసుపత్రి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జీజీహెచ్‌కు వస్తున్న రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. బుధవారం ఆయన జీజీహెచ్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులను కలిసి వైద్యసేవలను గురించి తెలుసుకున్నారు. ఫార్మసీ కౌంటర్ వద్ద క్యూలు ఎందుకు ఎక్కువగా ఉన్నాయని ఆరా తీశారు. భోజనాన్ని పరిశీలించారు. గ్యాస్ మాత్రలు లేవని కొందరు మంత్రి దృష్టికి తెచ్చారు. ఆయన ముందు ఆప్రాన్ లేకుండా హాజరైన వైద్యురాలు కాకర్లకు నోటీసులు జారీ చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ రోగులకు ఏయే విభాగాలు ఎక్కడెక్కడ ఉన్నాయో సులువుగా తెలిసేందుకు సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది కొరత లేకుండా చూస్తామన్నారు. జీబీఎస్ అంటువ్యాధి కాదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రోగులకు స్ట్రెచర్లు, వీల్‌చైర్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. 4 రోజుల క్రితం జి.కొండూరు మండలం కందులపాడు శివారు చేగిరెడ్డిపాడు గ్రామానికి చెందిన ఓ మహిళ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉన్నారు.



రోగులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

జీజీహెచ్‌లో జీబీఎస్ వైరస్ కలకలం

విజయవాడ జీజీహెచ్‌లో జీబీఎస్ వైరస్ కలకలం రేపింది. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలానికి చెందిన ఒక మహిళ (30)కి ఈనెల 18న విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షల్లో ఆమెకు జీబీఎస్ వైరస్ ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు. ఆమెను ఐసీయూలో ఉంచి వైద్య సేవలందిస్తున్నారు.

63 పరీక్షా కేంద్రాల్లో

ఇంటర్మీడియెట్ పరీక్షలు

- కృష్ణాజిల్లాలో మార్చి 1 నుంచి జరిగే పరీక్షలకు సర్వం సిద్ధం
- హాజరుకానున్న 45,430 మంది విద్యార్థులు
- బాలుర కంటే బాలికలే అధికం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలో మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. 63 పరీక్షా కేంద్రాల్లో ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు 45,430 మంది హాజరవుతున్నారు. ఫస్టియర్ విద్యార్థులు 24,557, సెకండియర్ 20,873 మంది హాజరవుతున్నారు. బాలుర కంటే బాలికలే అధిక శాతం ఉన్నారు. 22,187 మంది బాలురు కాగా 23,243 మంది బాలికలు హాజరవుతున్నారు. ఫస్టియర్‌కు 12.114 మంది బాలురు, 12443 బాలికలు, సెకండియర్‌కు 10,073 మంది బాలురు, 10,800 బాలికలు హాజరవుతున్నారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 163 మందిని నియమించారు. 18 పోలీసు స్టేషన్లలో ప్రశ్నాపత్రాలకు స్ట్రాంగ్ రూమ్‌లుగా నిర్ణయించారు.

అన్ని శాఖల సహకారంతో పకడ్బందీగా పరీక్షల నిర్వహణ: సాల్మన్‌రాజు



పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖల సహాయ సహకారాలు తీసుకుంటున్నామన్నారు. ఈనెల 23న ఉయ్యూరు విశ్వశాంతి స్కూల్‌లో పరీక్షలు నిర్వహించే అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. తరగతులకు కలెక్టర్ హాజరవుతారన్నారు.

దళిత మహిళలపై పెరుగుతున్న హింస

- రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం దళిత మహిళలపై హింసాత్మక ఘటనలు పెరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత అన్నారు. దళిత స్త్రీ శక్తి సంస్థ 19వ వార్షిక మహాసభలు బుధవారం లెనిన్ సెంటర్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఐక్యవేదిక సమావేశ మందిరంలో జరిగింది. మహాసభలకు సంస్థ జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దళిత ఆదివాసీ మహిళలపై జరుగుతున్న హింస, మానసిక ఆరోగ్యం వివిధ కోణాలు అనే అంశంపై పలువురు వక్తలు మాట్లాడారు. దళిత మహిళలపై జరుగుతున్న లైంగిక దాడుల్లో 2 శాతం మాత్రమే నిందితులకు శిక్ష పడుతోందన్నారు. ఇలాంటి హింసాత్మక ఘటనలపై దళిత స్త్రీ శక్తి పోరాటం అభినందనీయమన్నారు. సంస్థ జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ మాట్లాడుతూ దళిత ఆదివాసీ స్త్రీలపై జరుగుతున్న అనేక హింసాత్మక ఘటనలను ప్రతిఘటిస్తూ బాధితులకు న్యాయం చేకూర్చే దిశగా సంస్థ పోరాడుతోందన్నారు. 19ఏళ్లుగా దళిత ఆదివాసీ స్త్రీలు, బాలికలపై జరిగిన దాడులు, హింసాత్మక ఘటనలపై చేస్తున్న ఉద్యమాలు, పోరాటాలను వివరించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమానత్వం సాధించే దిశగా ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. ఆచార్య నాగార్జున వర్సిటీ ప్రొఫెసర్ సరస్వతీ అయ్యర్ మాట్లాడుతూ స్త్రీలపై హింస అనేక ప్రభావాలకు గురిచేస్తోందన్నారు. ఇలాంటి సంఘటనలతో స్త్రీలు మానసిక రుగ్మతలకు గురౌతూ, తీవ్ర అనారోగ్యాలతో బాధపడుతున్నారన్నారు. సీనియర్ పాత్రికేయుడు విశ్వనాథ్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, జీజీహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మీ, సైకాలజిస్ట్ కృష్ణకుమారి, నాగార్జున వర్సిటీ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ రాధిక, సంస్థ ప్రతినిధులు సత్యకామా జాబాలి, బండారు రాజు, సత్యనారాయణమ్మ, వివిధ జిల్లాల నుంచి మహిళా ప్రతినిధులు హాజరయ్యారు.



దళిత స్త్రీ శక్తి సంస్థ వార్షిక మహాసభల్లో ప్రసంగిస్తున్న ఏపీ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత



విద్యార్థులను ప్రశ్నిస్తున్న జిల్లా న్యాయాధికారి అరుణ సారిక


గురుకుల పాఠశాల తనిఖీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీ గురుకుల పాఠశాలను జిల్లా న్యాయాధికారి ఎస్ అరుణసారిక బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో పెడుతున్న ఆహార పదార్థాలు, విద్యాబోధన ఎలా ఉందంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిల్వ పదార్థాలు పెడుతున్నారని, పాలు, మజ్జిగ, చారు నీళ్లలా ఉంటున్నాయని, కూరలు బాగుండటంలేదని విద్యార్థులు జిల్లా న్యాయాధికారికి తెలిపారు. రుచి, శుచి, శుభ్రత కలిగిన ఆహారం అందించాలని, స్కూల్ ఆవరణలో పరిశుభ్రత పాటించాలని ప్రిన్సిపాల్ కృష్ణమోహన్‌ను న్యాయాధికారి ఆదేశించారు. జిల్లా లీగల్‌సెల్ అథారిటీ సెక్రటరీ రామకృష్ణ, ఉయ్యూరు న్యాయాధికారి కే శ్రీహరి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాగిత గోపీచంద్, జీ శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ హయాంలోనే విద్యావ్యవస్థ నాశనం

- డీఎస్సీ అభ్యర్థులను కలిసి ఓట్లు అభ్యర్థించిన మండలి, పట్టాభి

అవనిగడ్డ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ పూర్తిగా సర్వనాశనమైందని, ఉపాధ్యాయులను వైన్‌షాపుల ముందు నిలబెట్టిన హీనచరిత్ర జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం అవనిగడ్డ విద్యానికేతన్ విద్యాసంస్థలో శిక్షణ పొందుతున్న డీఎస్సీ అభ్యర్థులు, ఉపాధ్యాయులను కలిసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పనిచేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ప్రజావ్యతిరేక విధానాలను డీఎస్సీ ఆశావహులకు ఆయన వివరించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. మార్చిలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని, జూన్ నాటికి 16వేల పైచిలుకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ పూర్తవుతుందన్నారు. మండలి వెంకట్రామ్, ఆప్సా డెమొక్రటిక్ రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు, విద్యానికేతన్ కన్వీనర్ పండ్రాజు లంకమ్మ ప్రసాద్, కొండవీటి ఈశ్వరరావు పాల్గొన్నారు.




డీఎస్సీ ఆశావాహులతో మాట్లాడుతున్న పట్టాభిరామ్, చిత్రంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఆ వార్డెన్ మాకొద్దు.. అధికారులతో విద్యార్థులు

మైలవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సరైన తిండి పెట్టని, భద్రత కల్పించలేని వార్డెన్ మాకొద్దంటూ విద్యార్థులు డీబీసీడబ్ల్యూవో మహేష్ ముందు వాపోయారు. 'వామ్మో వసతి గృహం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన డీబీసీడబ్ల్యూవో మహేష్ బుధవారం మైలవరంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు ఆయనకు తమ గోడును వెళ్లబోసుకుంటూ రెండేళ్లుగా వార్డెన్ ముఖం చూడలేదన్నారు. సరైన ఆహారం పెట్టరని, ఎవరిని అడగాలో తెలియదని వాపోయారు. ఆహారం ఒక పూట ఉంటే మరో పూట ఉండదని కొన్నిసార్లు కూరల్లో నీళ్లు పోస్తున్నారని దీంతో ఆరోగ్యాలు పాడవుతున్నాయని ఆవేదన చెందారు. చిక్కీలు, కోడిగుడ్లు చూసిందే లేదన్నారు. అర్ధాకలితో, అపరిశుభ్రతతో అలమటిస్తూ చదువులు సాగిస్తున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. సమస్యలు చెప్పుకునేందుకు వార్డెన్‌కు కాల్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేసే వారు కాదని పై అధికారులకు చెబితే అక్కడ మీకు హాస్టల్ ఉండదని బెదిరించేవారని తెలిపారు. ఎప్పుడైనా ఏబీసీడబ్ల్యూవో రవి ప్రసాద్ సరుకులు తెచ్చి వెళుతుండేవారని చెప్పారు. అన్ని విషయాలు రికార్డు చేశామని నివేదిక కలెక్టర్‌కు పంపి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. వార్డెన్ రమాదేవి అందుబాటులోకి రాలేదని ఇన్‌చార్జి వార్డెన్‌గా నరసింహారావుకు బాధ్యతలు అప్పగించామన్నారు. ఎంఈవో బాలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి నుంచి వివరాలు సేకరిస్తున్న డీబీసీడబ్ల్యూవో మహేష్



వీరమ్మ తల్లి సన్నిధిలో..

తిరునాళ్ల సందర్భంగా వీరమ్మతల్లిని జిల్లా న్యాయాధికారి కే అరుణ సారిక బుధవారం దర్శించుకుని పూజలు చేశారు. ఉయ్యూరులో ఎస్టీ గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ అనంతరం ఆమె అమ్మవారిని దర్శించారు. ఆలయ కమిటీ ఆమెకు స్వాగతం పలికి ఆలయంలోకి తోడ్కొని వెళ్లి అమ్మవారి దర్శనం చేయించి పసుపు కుంకుమ, వస్త్రాలు అందజేశారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రామకృష్ణ, ఉయ్యూరు న్యాయాధికారి కే శ్రీహరి జిల్లా న్యాయాధికారి వెంట ఉన్నారు.

బీచ్‌లో దక్షిణ కొరియా విద్యార్థుల క్లీనింగ్

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా మంగినపూడి బీచ్‌లో బుధవారం దక్షిణ కొరియా కేంద్రంగా పనిచేస్తున్న ఏఐఎస్‌ఈజడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. సముద్ర తీరంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి శుభ్రం చేశారు. పర్యాటక శాఖ జిల్లా అధికారి జి. రామలక్ష్మణరావు, సంస్థ ప్రతినిధి విలియం, ప్రేమ్‌కుమార్, దక్షిణ కొరియా విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.



మంగినపూడి బీచ్‌లో చెత్తను ఏరుతున్న విద్యార్థులు

2,603 గ్రాముల బంగారం రికవరీ

- కర్ణాటక బ్యాంకులో ఇంటిదొంగ ఆటకట్టు
- మీడియాతో కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న గన్నె సోమశేఖర్ ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారు వస్తువులను చోరీచేసి వాటి స్థానంలో రోల్డుగోల్డు నగలు పెట్టిన కేసులో 2603 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ ఆర్. గంగాధరరావు తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ తన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నిందితుడు సోమశేఖర్ యాజమాన్యాన్ని మోసగించి 3002 గ్రాముల బంగారాన్ని దొంగిలించాడన్నారు. దర్యాప్తు చేసిన తరువాత సోమశేఖర్ వివిధ బ్యాంకుల్లో తాను దొంగిలించిన బంగారాన్ని కుదువపెట్టాడన్నారు. ఆ బంగారాన్ని చాలా వరకు రికవరీ చేశామని, మిగిలిన బంగారాన్ని కూడా రికవరీ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు బంగారు రుణం ఇచ్చేటప్పుడు కస్టమర్ పూర్వాపరాలు తెలుసుకుని ఇవ్వాలన్నారు. ఇలా దొంగలు కుదువపెట్టిన బంగారానికి రుణాలిస్తే బ్యాంకులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఆర్‌పేట సీఐ ఏసుబాబు, చిలకలపూడి సీఐ నబీ, సీసీఎస్ సీఐ కె.వి.ఎస్. వరప్రసాద్‌కు రివార్డులు ఇస్తామన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	95, 104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.430

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పెడన, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పడమటవీధిలోని విఘ్నేశ్వర ప్రార్థనా మందిరంలో గుంటూరు శంకర నేత్రాలయం సహకారంతో ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్(ఏఐడబ్ల్యూఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఫెడరేషన్ నాయకులు తెలిపారు. సర్వోదయ చేనేత సొసైటీలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆధార్, ఆరోగ్యశ్రీ, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీలతో శిబిరానికి రావాలని సూచించారు. శుక్లాలు ఉన్న వారికి కంటి లోపల ఉచితంగా అద్దం(ఐవోఎల్) అమర్చుతారని, ఆపరేషన్లు అవసరమైన వారిని బస్సులో ఉచితంగా తీసుకెళ్లి శస్త్రచికిత్స చేయించి తీసుకొస్తారని తెలిపారు. పిచ్చుక ఫణికుమార్, బళ్ల సాంబశివరావు పాల్గొన్నారు.

ఓటరును మూడుసార్లు కలవండి

- ఆలపాటికి భారీ మెజారిటీ వచ్చేలా పనిచేయండి
- కూటమి నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి



అవనిగడ్డలో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు

అవనిగడ్డ , ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఓటరును మూడు సార్లు కలవాలని, ఎమ్మెల్సీ ఎన్నికలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు భారీ మెజారిటీ వచ్చేలా పనిచేయాలని కూటమి నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గాంధీక్షేత్రంలో మండలంలోని కూటమి నేతలతో బుధవారం వారు సమీక్ష నిర్వహించారు. గ్రామాలవారీగా ఓటర్ల జాబితా విభజన పూర్తయిందని, ప్రతీ ఓటరును కలిసి రాజేంద్రప్రసాద్‌కు అనుకూలంగా ఓటేసేలా ప్రచారం చేయాలని, గడిచిన 8 నెలల్లో ప్రభుత్వం తెచ్చిన పెట్టుబడుల వివరాలను పట్టభద్రులకు వివరించాలని, రానున్న రోజుల్లో స్థానికంగా లభించే ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని వారు సూచించారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, టీడీపీ నేత కొల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తోందీ ప్రభుత్వం



ప్రచారం చేస్తున్న లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్

మచిలీపట్నం టౌన్: వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు డీఎస్సీ వంటి ఉద్యోగాలకోసం పట్టభద్రులు ఎదురు చూశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ముందుకు వచ్చిందని టీడీపీ మచిలీపట్నం నియోజకవర్గ పరిశీలకుడు లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటేయాలంటూ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులను ఆయన కోరారు. హిందూ కళాశాల తదితర విద్యాసంస్థల్లో ఎన్నికల ప్రచారం చేశారు. టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, పీవీ ఫణికుమార్, కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, దింటకుర్తి సుధాకర్, దేవరపల్లి అనిత పాల్గొన్నారు.

మోదుమూడిలో..

అవనిగడ్డ రూరల్: ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని మోదుమూడిలో జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్‌ప్రసాద్, లంకే యుగంధర్, బచ్చు వెంకటనారాయణ, బచ్చు హనుమాన్, బచ్చు శ్రీహరి, బచ్చు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

నాగాయలంక మండలంలో..

నాగాయలంక: ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులను జనసేన నాయకుడు మండలి వెంకట్రామ్ కోరారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావుతో కలిసి బుధవారం మండలంలో ఆయన విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాగాయలంక స్కాలర్స్ హైస్కూల్, తలగడదీవి, భావదేవరపల్లి జడ్పీ హైస్కూళ్లు, ఫిషరీష్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఎమ్మెల్సీ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, తలశిల స్వర్ణలత, ఉప్పల ప్రసాద్, మండలి ఉదయభాస్కర్, తలశిల వెంకట నరసింహరావు పాల్గొన్నారు.

దింటిమెరకలో..

కోడూరు: ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోడూరు శివారు దింటిమెరకలో జనసేన నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మర్రే గంగయ్య, కొండవీటి సునీత, కోట రాంబాబు, సిద్ధినేని అశోక్ నాయుడు, పూతబోయిన సాయిబాబు, కాగిత రామారావు, అప్పికట్ల వినోద్, లంకే రవి పాల్గొన్నారు.

ఘంటసాల మండలంలో..



మల్లంపల్లి సచివాలయం వద్ద కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

ఘంటసాల: ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని మల్లంపల్లి, చిలకలపూడి, వి.రుద్రవరం, ఘంటసాలపాలెం గ్రామాల్లో ఓటర్లను టీడీపీ నేతలు కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, కృష్ణా మిల్క్ యూనియన్ కార్యవర్గ సభ్యుడు వేమూరి సాయి వెంకటరమణ, సర్పంచ్‌లు బెల్లంకొండ అమలేశ్వరరావు, వెనిగళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రథమ ప్రాధాన్య ఓటు ఆలపాటికి వేయండి



నిడమర్రులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

కృత్తివెన్ను: ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ బుధవారం నిడమర్రులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పట్టభద్రులను కలిసి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడులు, ఉద్యోగాల భర్తీని వివరించారు. కరపత్రాలను అందించి ఈనెల 27వ తేదీన నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రథమ ప్రాధాన్య వేసి భారీ మెజారిటీతో గెలిపించాలనీ ఓట్లు అభ్యర్థించారు.

ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దు

- పారిశుధ్య కార్మికులకే అందించాలి
- ప్రజలకు కలెక్టర్ డీకే బాలాజీ సూచన



బల్లిపర్రులో పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

పెడన రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దని, పారిశుధ్య కార్మికులకు అందించాలని ప్రజలకు కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. బుధవారం ఉదయం బల్లిపర్రులో పారిశుధ్య పనులను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు ప్రజల సహకారం అవసరమన్నారు. తడి, పొడి చెత్త నిర్వహణపై అవగహన కల్పించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. గ్రామంలో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. సేకరించిన చెత్త నుంచి కంపోస్ట్ ఎరువు తయారుచేసి, విక్రయించి పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు.

మా ఇళ్లను తొలగించకండి

- కలెక్టర్ డీకే బాలాజీకి రాజీవ్‌నగర్‌వాసుల వినతి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మా ఇళ్లను తొలగించొద్దంటూ కలెక్టర్ డీకే బాలాజీకి రాజీవ్‌నగర్‌వాసులు బుధవారం మొరపెట్టుకున్నారు. చాలాకాలంగా తాము అక్కడ నివసిస్తున్నామని, ఆక్రమణల పేరుతో మునిసిపల్ అధికారులు ఇళ్లను తొలగిస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. బాధితుల పక్షాన ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ తదితరులు కలెక్టర్‌ను కలిశారు. ఆర్డీవోతో విచారణ జరిపిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేద్దాం

- సమష్టిగా పనిచేయండి..ఉద్యోగులతో ఆర్డీవో స్వాతి



పెదకళ్లేపల్లిలో కృష్ణానది వద్ద స్నానఘాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో స్వాతి

మోపిదేవి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు సమష్టిగా పనిచేసి ఈ నెల 26, 27 తేదీల్లో పెదకళ్లేపల్లిలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని మచిలీపట్నం ఆర్డీవో స్వాతి కోరారు. ఉత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో బుధవారం పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి దేవస్థానం కల్యాణ మండపంలో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. లక్ష మందికిపైగా భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వస్తారని, ఘాట్ల వద్ద ఇసుక మేట్ల తొలగింపు, కరకట్ట వెంబడి భక్తుల రాకపోకలకు అనువుగా ముళ్లచెట్ల తొలగింపు పనులను ఇప్పటికే పూర్తి చేశామని ఆర్సీ ఏఈ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. నదిలో ప్రమాదాల బారిన పడకుండా స్నానమాచరించేలా బారికేడ్లు, మెష్ ఏర్పాటు చేయాలని ఆర్డీవో దృష్టికి గ్రామస్థులు తీసుకొచ్చారు. స్నానఘాట్లు, దుర్గానాగేశ్వరస్వామి దేవస్థానం వద్ద మూడు ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ హారిక తెలిపారు. ఈనెల 25వ తేదీ నుంచి 27 వరకు మచిలీపట్నం డివిజన్ పరిధిలోని పారిశుధ్య సిబ్బందిని డిప్యుటేషన్‌పై వేసి పెదకళ్లేపల్లిలో పారిశుధ్య పనులు చేయిస్తామని డీఎల్పీవో సీతారామయ్య తెలిపారు. గ్రామస్థులు ముందుకు వచ్చి పార్కింగ్‌కు అనువైన స్థలం ఇవ్వాలని చల్లపల్లి సీఐ ఈశ్వరరావు కోరారు. గ్రామస్థుల సూచనలతో పలు చోట్ల పార్కింగ్‌కు అనువైన పొలాలను అధికారులు పరిశీలించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత మంచినీరు, పులిహోర అందిస్తామని, త్వరగా స్వామి దర్శనమయ్యేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని ఆలయ ఈవో డి.శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. అవనిగడ్డ డీఎస్పీ టి.విద్యశ్రీ, ఎంపీడీవో జె.స్వర్ణభారతి, డిప్యూటీ తహసీల్దార్ వాణి, ఎస్సై సత్యనారాయణ, అవనిగడ్డ ఆర్టీసీ డీఎం హనుమంతరావు పాల్గొన్నారు.

మంచినీరు కలుషితమయిందని ఫిర్యాదు

మోపిదేవిలో రక్షిత మంచినీటి పథకం ద్వారా అందిస్తున్న నీరు డ్రెయినేజీ నీరు కలిసి కలుషితమయిందని పెదకళ్లేపల్లిలో సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో స్వాతికి పలువురు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. మంచినీటిని బాటిల్‌ను ఆర్డీవోకు చూపి, మూడు రోజులుగా నీరు కలుషితమై దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. వ్యాధులు ప్రబలకముందే చర్యలు తీసుకోవాలని కోరారు. నీరు ఎందుకు కలుషితమైందని పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావును ఎంపీడీవో స్వర్ణభారతి ప్రశ్నించారు. పైపు లీకేజీ అయ్యిందని వెంటనే సమస్య పరిష్కరిస్తామని ఆర్డీవోకు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

ఎండు చేపల తయారీని కుటీర పరిశ్రమగా గుర్తించాలి

నాగాయలంక, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎండు, ఉప్పు చేపల తయారీని కుటీర పరిశ్రమగా గుర్తించి మహిళా కార్మికులకు ఇస్తున్న అన్ని రాయితీలను మహిళా మత్స్యకారులకు వర్తింపజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు కోరారు. జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి, నాయకులు నాగిడి తాతారావు, లంకే శ్రీనివాసప్రసాద్‌తో కలిసి బుధవారం కృష్ణానది సమీపంలో ఎండు, ఉప్పుచేపలు తయారుచేసే మహిళా మత్స్యకారులను కలిసి ఆయన మాట్లాడారు. ఎండు చేపల తయారీలో పరిశుభ్రత పాటించటంతోపాటు నాణ్యమైన ఎండు చేపలను వినియోగదారులకు అందించేందుకు మహిళా మత్స్యకారులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ ఇప్పించాలన్నారు. బయోమెట్రిక్ గుర్తింపు కార్డులు జారీ చేయాలని, షెడ్లు, ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 50 ఏళ్లు పైబడిన మహిళా మత్స్యకారులకు పింఛన్ ఇవ్వాలన్నారు. వార్డుసభ్యులు కొల్లు శివలత, చంద్రలంక, కొప్పాడి వెంకటేశ్వరమ్మ, పుణ్యవతి, కొల్లు నాగబాబు పాల్గొన్నారు.

పైపులైన్ పగిలి గ్యాస్ లీక్

అవనిగడ్డ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రి సమీపంలో మేఘా గ్యాస్ లైన్ పగిలిపోవటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. డ్రెయినేజీ పనుల్లో భాగంగా ప్రభుత్వాస్పత్రి వద్ద జేసీబీతో తవ్వకాలు జరుపుతుండగా, పైపులైన్ పగిలి ఒక్కసారిగా గ్యాస్ లీకయ్యింది. ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చెందారు. పంచాయతీ సిబ్బంది వెంటనే గ్యాస్ కంపెనీ ప్రతినిధులకు తెలియజేయడంతో వారు లైన్‌ను నిలుపుదల చేసి తక్షణమే మరమ్మతులు చేశారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహిళా అధ్యాపకులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నగరంలోని ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కళాశాల వద్ద విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకెళితే ప్రిన్సిపాల్‌ను బదిలీచేసి నూతన ప్రిన్సిపాల్‌ను నియమించారని తెలిపారు. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

జిల్లాకు మంచిపేరు తెచ్చారు

- ముంతాజ్ బేగం, అప్పికట్ల దీప్తి, తోట విజయకుమారికి కలెక్టర్ బాలాజీ, ఆర్డీవో స్వాతి అభినందన



తోట విజయకుమారి, ముంతాజ్ బేగం, అప్పికట్ల దీప్తిని అభినందిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మంచిపేరు తెచ్చారంటూ ఇటీవల సీఎం చంద్రబాబు నుంచి కందుకూరులో స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకున్న ముంతాజ్‌బేగం, రిపబ్లిక్‌డే సందర్భంగా రాష్ట్రపతి ముర్ము, ప్రధాన మంత్రి మోదీల వద్ద వీణావాదం చేసిన అప్పికట్ల దీప్తి, రాజస్థాన్‌లో అథ్లెటిక్స్‌లో మూడు పతకాలు పొందిన తోట విజయకుమారిని కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్డీవో స్వాతి వేర్వేరుగా అభినందించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ముగ్గురినీ కలెక్టర్ బుధవారం సత్కరించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్డీవో ఘనంగా సత్కరించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మచిలీపట్నం అధ్యక్షుడు పి. శ్రీరామ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ఘంటసాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో స్వాతి బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలపై ఆమె ఆరా తీశారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్, డీటీ కనకదుర్గ, ఆర్ఐ.శ్రీనివాస్, రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు, పీడీఎస్ డీటీ కె.శ్రీనివాసరావు, ఎంఈవో-2 ఎండీ మోమిన్, హెచ్‌ఎం శ్రీరంగవల్లి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ..తాపీ కార్మికుడి దుర్మరణం

చల్లపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో తాపీ కార్మికుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన జాతీయ రహదారిపై నూకలవారిపాలెం అడ్డరోడ్డు సమీపంలో బుధవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అవనిగడ్డకు చెందిన షేక్ నాగూర్‌బాషా(36) కొంతకాలంగా మచిలీపట్నం ఇనగుదురుపేటలో అత్తవారింటి వద్ద ఉంటూ తాపీ పనులు చేస్తున్నాడు. బుధవారం ఉదయం అవనిగడ్డ వచ్చి సాయంత్రం బైక్‌పై తిరిగివెళుతుండగా హైవేపై నూకలవారిపాలెం అడ్డరోడ్డు సమీపంలో చెన్నయ్ నుంచి విశాఖపట్నం వెళుతున్న కూల్‌డ్రింక్ లోడు లారీ ఢీకొంది. టైరు కింద పడి నాగూర్‌బాషా కాలు నుజ్జునుజ్జయింది. తీవ్రంగా గాయపడిన నాగూర్‌బాషాను హైవే పెట్రోలింగ్ అంబులెన్స్‌లో మచిలీపట్నం ప్రభుతాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఎస్సై పీఎస్వీ సుబ్రహ్మణ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గుర్తింపు కార్డులు లేక రాష్ట్రంలో 70 శాతం మంది కౌలు రైతులు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారని, ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేసి ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, సహాయ కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కొందరు ఆసాములు బంధువుల పేరిట కౌలు రైతుల గుర్తింపు కార్డులు తీసుకుంటున్నారని, వారి పేరిట లబ్ధిపొందుతున్నారని తెలిపారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడిని కలిశామని ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.



కమిషనర్ బాపిరాజుకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కమిషనర్ బాపిరాజుకు బుధవారం ఏఐటీయూసీ నాయకుడు యర్రంశెట్టి ఈశ్వరరావు తదితరులు వినతిపత్రం అందించారు. ఆప్కాస్‌ను రద్దు చేసి, బడా కంపెనీలకు ఏజెన్సీలు అప్పజెప్పాలనుకోవడం తగదన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, కార్మికుల నియామకాల బాధ్యత మునిసిపల్ శాఖే తీసుకోవాలన్నారు. ప్రైవేట్ కంపెనీలు, ఏజెన్సీలు మధ్యవర్తులకు ఇస్తే కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కర్నాటి అర్జునరావు, కరపాటి స్వామి, యర్రంశెట్టి శ్రీమన్నారాయణ, భూపతి శివరామయ్య, ఎస్.కోటేశ్వరరావు, రాజు, మణికంఠ పాల్గొన్నారు.

హాస్టళ్లకు బియ్యం, కందిపప్పు వితరణ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అన్నదానాన్ని మించిన దానం లేదని, రైస్‌డ్రైవ్ ఫర్ రిపబ్లిక్‌డే నినాదంతో స్టార్ విద్యా సంస్థల విద్యార్థులు తమ ఇంట్లోని నిత్యావసర వస్తువులను పేదలకు దానం చేసేందుకు ముందుకు రావడం ముదావహమని ఆర్డీవో కె.స్వాతి అన్నారు. స్టార్ స్కూల్‌లో విద్యార్థులు సేకరించిన 3,500 కిలోల బియ్యం, 250 కిలోల కందిపప్పు, 205 లీటర్ల నూనెను కేఎన్‌హెచ్ బాయ్స్ హాస్టల్, షార్కీ గరల్స్ హాస్టల్, హెల్పింగ్ స్పాట్, అన్నపూర్ణ వృద్ధాశ్రమం, ఆర్‌సీఎం బాలికల హాస్టల్, స్నేహాలయ వృద్ధాశ్రమం, మదీనా మదర్‌సాకు ఆర్డీవో అందజేశారు. స్టార్ విద్యాసంస్థల మెంటర్ శ్రీరామ్, డైరెక్టర్ అయ్యప్పస్వామి పాల్గొన్నారు.

వైభవంగా కమలాత్మికా సహిత అచలేశ్వర పంచాయతన ప్రతిష్ఠా పూజలు



పూజల్లో పాల్గొన్న విద్యాసాగర్ గురూజీ, ట్రస్టీ మేకా బంగారుబాబు దంపతులు

చల్లపల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పాగోలులోని శ్రీకైవల్యాశ్రమ చలాచలబోధోపదేశ మందిర ప్రాంగణంలో కమలాత్మికా సహిత అచలేశ్వర పంచాయతన ప్రతిష్ఠా మహోత్సవ పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం మండప పూజలు, మూలమంత్ర జపములు, దశమహావిద్య మంత్ర అనుష్ఠానములు, ఊరేగింపు, రుద్రహోమం, దశమహావిద్యా హోమం, సాయంత్రం క్షీరాధివాసం, మూలమంత్ర జప అనుష్ఠానములు, శ్రీచక్రార్చన, మూలమంత్ర హోమము, బలిహరణ, ఆజ్యపూర్ణాహుతి కార్యక్రమాలను విద్యాసాగర్ గురూజీ పర్యవేక్షణలో డాక్టర్ వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని, కేదారశర్మ నిర్వహించారు. ఆలయ ట్రస్టీ మేకా బంగారుబాబు, వక్కలగడ్డ దుర్గాప్రసాద్ దంపతులు పాల్గొన్నారు.

వీణం శ్రీనివాసరావుకు సత్కారం

పెడన, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శిష్టకర్ణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన వీణం శ్రీనివాసరావుకు అగస్త్యేశ్వర స్వామి, శ్యామలాంబ ఆలయాల అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో అగస్త్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బుధవారం సన్మానం నిర్వహించారు. అగస్త్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బళ్ల ప్రసాద్, శ్యామలాంబ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బొడ్డు దీక్షానందుడు పాల్గొన్నారు.

నగరంలో స్టేడియం నిర్మించాలి

- ఏపీ హాకీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి శ్రవణం రామకృష్ణ



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నగరంలో స్టేడియం నిర్మిస్తే హాకీ క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఎదిగేందుకు అవకాశం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ హాకీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి శ్రవణం రామకృష్ణ అన్నారు. అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన రామకృష్ణ బుధవారం మీడియాతో మాట్లాడారు. మచిలీపట్నంలో మూడుసార్లు రాష్ట్రస్థాయి హాకీ పోటీలు నిర్వహించామన్నారు., హాకీ క్రీడకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకు రావాలన్నారు. మచిలీపట్నంలో వేసవిలో ఉచిత హాకీ శిక్షణ శిబిరాలు చాలా కాలంగా నిర్వహిస్తున్నామన్నారు. జాతీయ క్రీడ హాకీకి మరింత ప్రాచుర్యం కల్పిస్తే క్రీడాకారులను ప్రోత్సహించినట్టవుతుందన్నారు. రామకృష్ణ సంయుక్త కార్యదర్శిగా ఎన్నికవడం పట్ల హాకీ అసోసియేషన్ జిల్లా సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రాథమిక పాఠశాలలను పటిష్ఠ పరచండి

- డీఈవోకు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం వినతి



తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో రామారావు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలను పటిష్ఠ పరచాలని డీఈవో పీవీజే రామారావుకు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కైతేపల్లి దాసు కోరారు. తన కార్యాలయం లో బుధవారం తెలుగునాడు ఉపాధ్యాయ క్యాలెండర్‌ను డీఈవో ఆవిష్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు డి. కృష్ణ, ప్రధాన కార్యదర్శి రాయవరం నరసింహరాజులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

పెడన, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. నాదెళ్ల కోటేశ్వరరావు, పిచ్చుక శంకర్, పేరక రాంబాబు, అజయ్, రవి పాల్గొన్నారు. శివాజీ జయంతి సందర్భంగా హిందూ బంధువుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో హరినామసంకీర్తన నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ సంకీర్తన అగస్త్యేశ్వరస్వామి ఆలయం వరకు కొనసాగింది. వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామీజీలు ప్రవచనాలు చెప్పారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

గూడూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మల్లవోలు గ్రామానికి చెందిన పోలవరపు రాము(36) అనారోగ్యానికి మంగళగిరిలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. రాము అంత్యక్రియల నిమిత్తం మల్లవోలుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ రూ.5 వేలు అందజేసింది. అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన త్రినాథ్, ముద్దినేని వెంకటేశ్వరరావు, పోలవరపు వీరబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు దావు చినబాబు కన్నుమూత

కోడూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మెరకగౌడపాలేనికి చెందిన టీడీపీ నాయకులు దావు చినబాబు(60) హఠాత్తుగా మరణించారు. బుధవారం ఉదయం గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. టీడీపీ, జనసేన నాయకులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	95, 104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 430

నేడు విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు

గుడివాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గుడివాడ డివిజన్ పరిధిలోని పెదపారుపూడి, బాపులపాడు, ఉంగుటూరు మండలాలు, గుడివాడ, కైకలూరు నియోజకవర్గాల్లోని విద్యుత్ వినియోగాదారులకు గురువారం విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ జి.బి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏలూరురోడ్డులోని డీవీఎస్ కాంప్లెక్స్‌లోని శ్రీఫంక్షన్ హాల్‌లో సీజీఆర్ఎఫ్, విజయవాడ ఛైర్‌పర్సన్ విక్టర్ ఇమ్మానియేలు అధ్యక్షతన జరగనున్న కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని విద్యుత్ సరఫరాలో లోపాలు, నియంత్రిక మంజూరు, విద్యుత్ బిల్లుల సమస్యలు, లో-ఓల్టేజ్ ఇబ్బందులు తదితర సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు.



శిక్షణ ఇస్తున్న ఎంఈవో సురేష్

అంగన్వాడీలకు శిక్షణ

పెదపారుపూడి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జ్ఞానజ్యోతి ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎంఈవో పి.సురేష్ పాల్గొన్నారు. చిన్నారుల అభివృద్ధికి ఆహారం, పర్యవేక్షణ, సంరక్షణ చాలా ముఖ్యమని తెలిపారు. ప్రతీ నెల చిన్నారుల బరువు చూసి నమోదు చూసుకోవాలని, చిన్నారులకు ఆటల పోటీలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య అందించాలని ఎం.శివనాగమణి తెలియజేశారు. అరుణ కుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవాని, శివశంకర్, శ్రీదేవి, నాగజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధిపై వాస్తవాలను కోర్టుకు తెలపాలి

గుడివాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ-కంకిపాడు రహదారులను అభివృద్ధి చేయాలని కోరుతూ హైకోర్టులో వేసిన ప్రజావ్యాజ్యం పిల్ బుధవారం విచారణకు వచ్చిందని భవిష్యత్ భద్రత దళం వ్యవస్థాపకులు వై.వి మురళీకృష్ణ తెలిపారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్, సహ న్యాయమూర్తి సి.హెచ్ రవితో కలిసి విచారణ జరిపారని, పాత అఫిడవిట్‌లో పేర్కొన్న విషయాలు కాదని, వాస్తవ పరిస్థితులను కోర్టుకు తెలపాలని ఆర్ అండ్ బి ప్రిన్సిపాల్ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారన్నారు.



ఆదిత్య డిగ్రీ కళాశాలలో అధ్యాపకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల



కొసూరులో ఓట్లు అభ్యర్థిస్తున్న కుమార్ రాజా సోదరులు, నేతలు

ఆలపాటిని గెలిపించే బాధ్యత మనందరిది

గుడివాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల అరాచక జగన్ పాలనలో అన్ని విధాలుగా వెనుకబాటుకు గురైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్న కూటమి ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు, పట్టభద్రులు అండగా నిలవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. బుధవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తరపున ఎమ్మెల్యే వెనిగండ్ల స్థానికంగా పలు విద్యాసంస్థల్లో ప్రచారం నిర్వహించారు. స్థానిక శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు తమ సమస్యలను ఎమ్మెల్యే వెనిగండ్ల దృష్టికి తీసుకురాగా, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ యిచ్చారు. ఎమ్మెల్యే వెనిగండ్ల మాట్లాడుతూ ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు రాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఆలియా బేగం, పాల్గొన్నారు.

పామర్రు: కూటమి బలపరిచిన గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకోవడం మన అందరి బాధ్యత అని జనసేన జిల్లా అధ్యక్షుడు బండి రామకృష్ణ పిలుపునిచ్చారు.స్థానిక జనసేన కార్యాలయంలో బుధవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌తో కలిసి కూటమి నేతలు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, 27న జరిగే పోలింగ్ సక్రమంగా జరిగేలా చూడాలని దిశ నిర్దేశం చేశారు. తాడిశెట్టి నరేష్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో మొత్తం 6400మంది పట్టభద్రుల ఓట్లు ఆలపాటికి పడే విధంగా రూపొందించిన కార్యచరణ ప్రణాళికను వివరించారు. కార్యక్రమంలో జనసేన, కూటమి నేతలు గడ్డెంరాజు, ఎంపీటీసీ సభ్యుడు కూనపరెడ్డి సుబ్బారావు, సింహాద్రి క్రాంతికూమార్, పత్తిపాటి నరేష్, అల్లంశెట్టి గోపి తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరు లో సచివాలయ సిబ్బందిని ఓట్లు అభ్యర్థిస్తున్న టీడీపీ నాయకులు

కూచిపూడి: కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సోదరులు చాణిక్య, చైతన్యలు బుధవారం మొవ్వ మండలంలోని కాజ, కోసూరు గ్రామాల్లో కూటమి నేతలతో కలిసి ఓట్లు అభ్యర్థించారు. రాజేంద్రప్రసాద్‌కు అఖండ విజయం చేకూర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మల రాజా, వీరంకి తులసీదాస్, మంగమ్మ, యార్లగడ్డ శ్రీనివాసరావు, చందు, మేకా విజయ్ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: కృష్ణా గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ గుడ్లవల్లేరులో టీడీపీ నాయకులు బుధవారం ప్రచారం చేశారు. ఓటర్ల ఇళ్లకు వెళ్లి కూటమి ప్రభుత్వ పనితీరును తెలుపుతూ రాజేంద్ర ప్రసాద్‌కు ఓట్ చేయాలని కోరారు. గ్రామ సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో సిబ్బందిని కలిసి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ నాయకులు చాపరాల బాలాజీ, ప్రసాద్, జానిపాల్గొన్నారు.

తోట్లవల్లూరు: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ కోరారు. మండలంలోని పెనమకూరులో బుధవారం రాత్రి మండలంలోని బూత్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. 27న పట్టభద్రుల ఓటర్లను తోట్లవల్లూరు పోలింగ్ కేంద్రానికి తీసుకు రావటంపై చర్చించారు. ముఖ్యంగా బూత్ కన్వీనర్ల పాత్రను సమావేశంలో శివరామ్ వివరించారు. మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఎస్. కృష్ణను మన్, కొత్తపల్లి కిరణ్, వీరంకి వరహాలరావు, చొప్పరపు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయసారథి

చెత్తనుంచి సంపద తయారీపై దృష్టి సారించాలి

గుడ్లవల్లేరు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తడి, పొడిచెత్త వేర్వేరుగా సేకరించాల్సిన విధానం, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణా పనితీరుపై మండలస్థాయి సమావేశం బుధవారం గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విజయసారథి నిర్వహించారు. సిబ్బందికి తడి, పొడి చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సునీల్, పంచాయతీ కార్యదర్శులు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొవ్వలో ఎమ్మెల్సీ ఎన్నికకు 1259 మంది ఓటర్లు

కూచిపూడి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు మొవ్వ మండలంలోని 1259 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తహసీల్దార్ కె.మస్తాన్ తెలిపారు. మండలంలోని 16 సచివాలయాలకు సంబంధించిన వీఆర్వోల ద్వారా 21 గ్రామపంచాయతీలోని ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మొవ్వ జడ్పీ పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు.



గుడ్లవల్లేరులో ఛత్రపతి శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



గుడివాడలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

గుడివాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్‌కె) ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు అంగడాల సతీష్, శీలం శంకరరావు, రవి, దివితేజ, బోనం గోపిక, రీటా, పండు, జ్యోతి, చరణ్ పాల్గొన్నారు.

పామర్రు: స్థానిక తెలుగు లలితా కళాతోరణం వేదిక వద్ద హైందవ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. తొలుత పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ, జనసేన నేతలు యార్లగడ్డ రమేష్, స్వర్ణ శివ, ఫణీంద్ర, ఊరిమి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం గుడ్లవల్లేరు శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివాజీ వీరోచిత గాథలను పాఠశాల కరస్పాండెంట్ సింగంశెట్టి ఆదినారాయణ విద్యార్థులకు వివరించారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ నిఘా

గుడివాడ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాలపై పోలీస్ డ్రోన్ కెమెరాలతో ప్రత్యేకంగా నిఘాను ఏర్పాటు చేసినట్లు వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. డీఎస్పీ ధీరజ్ పర్యవేక్షణలో డ్రోన్ కెమెరాలతో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు బానిసలవుతున్న విద్యార్థులపై 'థర్డ్‌ఐ'లాగా డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంటుందన్నారు. పాఠశాలలు, కళాశాలల ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాల సహాయంతో మహిళల భద్రతపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. పట్టణ పరిసర ప్రాంతాలు పోలీసుల కనుసన్నల్లో ఉంటాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, మత్తు పదార్థాల సేవనం, పేకాట, కోడి పందాల నిర్వహించడం వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు.



డ్రోన్‌ను చూపుతున్న వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్

మూడు పాఠశాలలను 'మోడల్'గా ప్రతిపాదనలు పంపాం

● గుడ్లవల్లేరు ఎంఈవో - 2 వేణుగోపాల్

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఏఒక్క పాఠశాల కూడా పాఠశాలల విలీనంలో విలీనం కావడం లేదని, ఏ పాఠశాల పోవడం లేదని గుడ్లవల్లేరు ఎంఈవో - 2 వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని ఎంపీపీఎస్ అంగలూరు మైన్, గుడ్లవల్లేరు-1, డోకిపర్రు మైన్ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపామని ఆయన చెప్పారు.ఇక కొత్తగా హైస్కూల్స్ ఏమీ మండలంలో ప్రతిపాదనలు ప్రస్తుతం లేవని వేణుగోపాల్ చెప్పారు. అయితే గుడ్లవల్లేరు ఎంపీయూపీ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ పాఠశాలకు 500 మీటర్ల లోపే 1945లో స్థాపించిన ఎస్ఈఆర్ఎం హైస్కూల్ (ఎయిడెడ్) సువిశాల ప్రాంగణం, పక్కా భవనంలో నడుస్తుండగా అక్కడే మరో హైస్కూల్ అవసరమా అనే విమర్శ గ్రామంలో సర్వత్రా వినిపిస్తోంది. అధికారులు అది ఎయిడెడ్, ఇది ప్రభుత్వ హైస్కూల్ అనే ప్రతిపాదనలు చేస్తున్నట్టు సమాచారం.



గుడ్లవల్లేరు అంబేద్కర్‌నగర్ ఎంపీపీఎస్ పాఠశాల

క్యాలెండర్ ఆవిష్కరణ

గుడివాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయాల గుడివాడ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్-2025ను బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆవిష్కరించారు. అనంతరం ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు, తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావులను కలిసి క్యాలెండర్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చాట్రగడ్డ రాజు, కార్యదర్శి జి.శంకరరావు, కోశాధికారులు పి.రవి కుమార్, పి.రోజా, ఉపాధ్యక్షులు కొడాలి సునీత, కె.మనోజ్‌కుమార్, జి.గణేష్. సంయుక్త కార్యదర్శులు నాగరాజు, డి.బేబీ దుర్గ, కె.భారతీ, కె.వినీల, సభ్యులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

ఎర్రనల్లి కనిపిస్తే నివారణ చర్యలు తప్పనిసరి

●ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మినుము పైరుపై అక్కడక్కడ ఎర్ర నల్లి తెగులు వస్తున్నట్లు తెలిసిందని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. బుధవారం సెరివేల్పూరు, శెరి దింటకుర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా మినుము పైరు సుడులు సుడులుగా ఉన్నట్లైతే రైతులు గమనించాలని తెలిపారు. ఎర్రనల్లి కనిపిస్తే వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్క ఆకులు తడిసే వరకు పిచికారీ చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి మాట్లాడుతూ రైతులు కొన్ని పొలాల్లో పూత దశకు త్వరలో వస్తున్నందున ఎటువంటి తెగుళ్ల ఆశించకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

సీపీఎం నేత పోతురాజుకు ఘన నివాళి

గుడివాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘ నాయకుడిగా, పలు ప్రజాఉద్యమాల్లో చురుక్కుగా పాల్గొన్న సీపీఎం సీనియర్ నాయకులు చొక్కాకుల పోతురాజు మృతి తీరని లోటని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎన్.మురళీకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సుందరయ్యభవన్‌లో పార్టీ మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి అధ్యక్షతన పోతురాజు సంతాప సభను నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లంకా సురేంద్ర, పి.రజిని, గూడపాటి గోపాల్, వై.కోటేశ్వరరావు, పామర్రు కార్యదర్శి ఒడుగు గంగాధర్, నాయకులు ఎం.విల్సన్, కె.నాగభూషణం, ఎం.అప్పారావు, ప్రకాష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పోతురాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు